# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక

**Sivananda Bharathi**

**Spiritual Monthly Magazine**

**Vol :16 Edition: 9** | సంపుటి: 16 సంచిక: 9 | శ్రీవిళంబి: నిజజ్యేష్ఠం ఆషాఢం | జూలై – 2018 July - 2018


**బ్రహ్మలీనులు పరమపూజ్యులు, శ్రీ స్వామి శివానంద, శ్రీ స్వామి చిదానంద, శ్రీ స్వామి దేవానంద ఆశీస్సులతో**


వ్యవస్థాపకులు :
**బ్రహ్మలీన స్వామి సత్యవ్రతానంద**

సంపాదకులు :
**ఆచార్య కసిరెడ్డి**

సహ సంపాదకులు :
**తిప్పరాజు కొండల్‌రావు**

సంపాదక మండలి :
**బొప్పన అరుణాదేవి**
**జి. సుధీర్‌కుమార్**
**డా॥ భేరీ సునీత**
**మరీచిక**



**శివానంద భారతి చందా వివరాలు.** సంవత్సరం చందా రూ.100/– శాశ్వత చందా రూ. 1100/–. సంవత్సర చందా కన్నా ఎక్కువ పంపరాదు. శాశ్వత చందా, పత్రిక నడచినంత కాలం అని గ్రహించగలరు.


## విషయసూచిక


| | |
|---|---|
| ఆత్మీయ భారతి – విశ్రాంతి భవనము – ఆశ్రమ కార్యవర్గం | 4 |
| సంపాదక భారతి – హింద్ూ అస్తిత్వం !? – ఆచార్య కసిరెడ్డి | 5 |
| హిందూ ధర్మ సమగ్ర స్వరూపం – స్వామి శివానంద | 8 |
| భావ పరిణతి – స్వామి సర్వవిదానంద | 14 |
| దివ్యజనని శారదాదేవి స్వరూపము .. – బొప్పన అరుణాదేవి | 16 |
| ధ్యానానికి తొలి అర్హతలు – అను. తిప్పరాజు కొండల్‌రావు | 19 |
| దయానంద సరస్వతి – సిలువేరు సుదర్శన్ | 22 |
| ప్రస్థాన త్రయము – ఆకుల రామయ్య | 26 |
| పద్య భారతి – డా॥ వడ్లూరి ఆంజనేయరాజు | 30 |
| భజన భారతి – వేల్పుల పెద్ది రాజయ్య | 31 |
| నారాయణీయం – శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం | 32 |
| మహాభారతము – శ్రీ బొగ్గరపు గంగాధరశెట్టి | 35 |
| గురు భారతి – డా॥ రాజేశ్వరీ సుబ్రహ్మణ్యం | 39 |
| రమణ తత్త్వము – బొప్పన కృష్ణప్రసాద్ | 40 |
| జ్ఞాన గంగాలహరి – డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి | 43 |
| **The Nature of meditation.. ...** - Sri Chidananda | 45 |
| **Self Enquiry.. ...** - Smt. Vanasri | 49 |
| Jivatma-Paramatmaiykyam **...** - Sivananda Muthuraman | 52 |
| ప్రకటన భారతి | 54 |
| వార్తా భారతి | 55 |
| విశేష భారతి | 58 |



**ఆయా రచయితల అభిప్రాయాలు వారివే. ఆశ్రమ పత్రిక ఆలోచనా మాధ్యమం మాత్రమే.**

**ధర్మం అంటే!**

**శ్లో॥ ధృతిః, క్షమా, దమో, అస్తేయం - శౌచమింద్రియ నిగ్రహః ।**
**ధీర్విద్యా సత్యమక్రోధో - దశకం ధర్మలక్షణమ్ ॥** (మనుస్మృతి)

తా॥ ధైర్యం, సహనం, నిగ్రహం, దొంగతనం చేయకుండడం, శుభ్రత, ఇంద్రియాదులకట్టడి, బుద్ధి, విద్యా, సత్యం, అక్రోధం ఈ పది ధర్మ లక్షణాలు.

**ధర్మపథం - భారతం**

**కం॥ ఒరులేయవి యొనరించిన - నరవర ! అప్రియము తన మనంబునకగు, తా**
**నొరులకు నవి సేయకునికి - పరాయణము పరమ ధర్మపథములకెల్లన్**

తా॥ ఇతరులు ఏది చేసినచో మన మనస్సునకు కష్టము కలుగునో, ఆ పని మనము ఇతరులకు చేయకూడదు. ధర్మమార్గములలో కెల్ల ఇదే గొప్పది. **- భారతం**

# విశ్రాంతి భవనము

బ్రహ్మలీన శ్రీశ్రీశ్రీ సత్యవ్రతానంద స్వామి వారు నిర్మించిన గాంధీ ఆసుపత్రిలోని శివానంద **"విశ్రాంతి భవనం"** దిన దినాభివృద్ధి చెందుతుంది. ఇంతకు ముందు అన్ని వసతులతో పాటు ఉచితంగా రెండు పూటలా భోజనాన్ని అందించేవారు. జూన్ 14, 2018 నుండి **కాంటినెంటల్** వారి సహాయంతో ఉదయం అల్పాహారాన్ని కూడా **"సేవాభారతి"** సంస్థ సికింద్రాబాద్ కార్యదర్శి **నర్సింహమూర్తి** గారి ఆధ్వర్యంలో విశ్రాంతి భవనాన్ని ఇంకా ఇంకా ముందుకు తీసుకెళుతున్నారు.

బ్రహ్మలీన **శ్రీశ్రీశ్రీ దేవానంద స్వామి** (చిన్నస్వామి) 81వ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నాము. పాదుకాపూజ, భజన, జాతీయ సాహిత్య పరిషత్ సభ్యులు, ప్రముఖ రచయిత్రులు భేరిసునీతా రాంమోహన్‌రెడ్డి, బొప్పన అరుణాదేవి, స్వామి ప్రసన్నానంద స్వామి, తిప్పరాజు కొండల్‌రావు గార్ల ప్రవచనాలు జరిగాయి. ఈ సందర్భంగా సేవాభారతి, శ్రీవత్స నృసింహ పాలపర్తి, మోరంపూడి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలకు, వీల్‌చైర్లు, చేతికర్రలు, పేద విద్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు, కంప్యూటర్లను కదం బిడ్జి స్కూల్ విద్యార్థులకు అవసరమైన నిత్యావసర వస్తువులను అధ్యక్షులు శ్రీ జి. సుధీర్‌కుమార్. పి. రమేష్, సేవాభారతి సంస్థ కార్యదర్శి నర్సింహమూర్తిగార్లు పంపిణి చేయడం జరిగింది. అలాగే జూన్ 21, 2018 నాడు ప్రపంచ యోగా దినోత్సవాన్ని కూడా ఘనంగా జరుపుకొన్నాం.

**శ్రీ శివానందాశ్రమం** ధన్యవాదాలతో . . . భవదీయ
పద్మారావునగర్, సికింద్రాబాద్ **ఆశ్రమ కార్యవర్గం**
01-07-2018 **శివానంద భారతి, సంపాదక మండలి**

సంపాదక భారతి

# హిందూ అస్తిత్వం !?

స్వామి శివానంద సరస్వతీ మహారాజ్ రచించిన 300 పుస్తకాల్లో హిందుత్వ సమగ్రదర్శనం ఒకటి. అది శివానంద భారతి పత్రిక పాఠకులకు నెల నెలా అందుతూనే ఉంది. హిందూ ఫిలాసఫి (తత్త్వం), హిందూధర్మం, హిందూ సంస్కృతి... అనే ఈ పదాలన్నీ హిందుత్వంలో అంతర్భాగమే. ఇవన్నీ హిందూజీవన విధానంలో చెప్పుకొనే పదాలే.

అటువంటి హిందుత్వం విస్తరింస్తుందా ! అసలు నిలుస్తుందా ! అన్న ప్రశ్నలు పుడుతున్నాయి. ఆ మధ్య పార్లమెంటులో హిందువుల వృద్ధి (గ్రోత్) ఎలా ఉంది అని అడిగిన ప్రశ్నకు మిగతావారి ఎదుగుదల (సంఖ్యాపరంగా) కంటే, హిందువుల సంఖ్య తక్కువగా ఉంది అని కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. ఆ సమాధానంవల్ల ఇదివరకే ఒకటి రెండు సంస్థలు చేసిన సర్వేలను సమర్థించినట్లయింది; కారణం తెలిసినట్లయింది.

ఏమిటా సర్వే ? 2050 వరకల్లా హిందువుల సంఖ్య తగ్గుతుంది ; ముస్లింల సంఖ్య పెరుగుతుందని !?

అయితే వచ్చే నష్టమేమిటిని ! హిందువులు అల్ప సంఖ్యాకులైన అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు ముస్లిందేశాలుగా మారిపోయాయి. అక్కడున్న హిందువుల్లో 80% ఊచకోతకు గురయ్యారు. అవి ఇప్పుడు తమ మతం వారిని తప్ప మరో మతం వారిని అక్కడ ఉ ండనివ్వవు. ఎవరైనా ఒకటీ అరా మరో మతం వారున్నారంటే వారు బజార్లు ఊకడం కొరకు, పయఖానాలు ఎత్తిపోయడం కొరకే ఉన్నారని గ్రహించాలి.

హిందువులకు తమ మాతృదేశ వికాసం మీదనే దృష్టి. ఆ కారణంగానే దేశ రక్షణకు, ఆర్థిక ప్రగతికి ప్రథమ స్థానమిస్తారు. హిందువులు సహజంగా ఈ దేశీయులు. మిగతావారు ఈ దేశంలోకి జొర్రబడ్డవారు; మతాంతీకరణలతో హిందువులను మారుస్తూ తమ సంఖ్యను పెంచుకొంటున్నారు. ఎలాగైనా ఈ దేశాన్ని ఆక్రమించాలనే ప్రయత్నంలో ఉన్న వారు. అందుకొరకు ఆయా తమ మత దేశాల వారి సహకారాన్ని పొందుతున్నవారు.

సమాజానికి హాని కలిగించే పనులు చేయడం కన్నా ఏమీ చేయకుండా వుండడం ఉత్తమం

కుటుంబ నియంత్రణ పాటించకుండా జనసంఖ్య పెంచడం, తమ మతస్థులైన చొరబాటుదారులకు ఆహ్వానం పలికి, వారికి ఆశ్రయం కలిపించడం, రోహింగ్యాల వంటి వలసవాదులకు తమ మత దేశాలనుండి పారిపోయి వచ్చిన వారికి స్థిరనివాసం కల్పించాలని ప్రయత్నాలు చేయడం, దొంగతనంగా ఎందరినో ఓటరులిస్టులో చేర్చడం, హిందువులను భయభ్రాంతులకు గురిచేసే జిహాది ఐసిఎస్ మనస్తత్వంతో విధ్వంసాలు మారణహోమాలు సృష్టించడం, ఆ భయానక వాతావరణంలో హిందువులు తమ గ్రామాలు – బస్తీలు వదలిపోవడం, ... ఇన్ని కారణాలవల్ల హిదువుల సంఖ్య తగ్గడం – ఇతర మతస్థుల సంఖ్య పెరగడం ప్రభుత్వపూర్వకంగా జరుగుతూనే ఉంది.

2050 వరకు ఇలాగే కొనసాగితే హిందువుల సంఖ్య తగ్గుతుంది. అప్పుడు అఫ్ఘనిస్తాన్‌లాగా, పాకిస్థాన్‌లాగా, బంగ్లాదేశ్‌లాగా, ఇండోనేషయాలాగా, మలేషియాలాగా, భారతదేశం విదేశీమతాలైన ముస్లిం–క్రిష్టియన్ల దేశంగా మారిపోతుంది. అప్పుడు అల్ప సంఖ్యాకులైన హిందువులేమవుతారు. పాకిస్థాన్ బంగ్లాదేశ్‌లల్లో ఊచకోతకు గురైనట్లు బలైపోతారు. పక్కన ఉన్న ఏ దేశంలోకి అయినా పరుగెత్తి దాచుకొనే అవకాశం కూడా లేదు.

మరి ఈ వేల సం॥ల హిందూజాతి మాతృభూమి, వారి వేదాలు, దర్శనాలు పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, గుళ్ళూ బళ్ళూ ఏవీ ఉండవు. అన్నీ నాశనం చేయబడతాయి. హిందూదార్శనికులు ప్రపంచానికి అందించిన ఈ క్రింది శాశ్వతమూల్యాలు నాశనమవుతాయి.

**అందరిలో ఒకే పరమాత్మ ఉన్నాడు.**

**కేవలం మానవులలోనే కాదు ప్రాణులన్నిట్లో పరమాత్మ ఉన్నాడు.**

**అందరం సమానమే (ఆత్మవత్ సర్వభూతాని).**

**వారి వారి నైపుణ్యాన్ని బట్టి ఏ వృత్తినైనా స్వీకరించవచ్చు.**

**వ్యక్తి తన స్వీయ ధర్మాన్ని (డ్యూటీని) విడువరాదు.**

**మంచి ఎక్కడున్నా గ్రహించాలి.**

**భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించాలి.**

**జనని–జన్మభూమి స్వర్గంకన్నా మిన్న.**

**మనిషిగా బ్రతకాలి (మనుర్భవ).**

**తెలివైన ఏ వ్యసన పరునికన్నా, ఏ వ్యసనాలు లేని అమాయకుడు మిన్న**

**మానవుడు దివ్యమానవుడు కావాలి.**

**సేవాధర్మంలో పరోపకారమే గొప్పది.**

ఇలా ఎన్నో వేదాల్లో, ఉపనిషత్తుల్లో, పుణారాణాల్లో, స్మృతులని పిలువబడే ధర్మశాస్త్రాల్లో ఉన్నాయి. ఇప్పుడు హిందువులే తగ్గిపోతే, వాళ్లదేశమే లేకపోతే, వాళ్ల గ్రంథాలెక్కడ ఉంటాయి. అలనాడు తక్షశిల-నలందా విశ్వవిద్యాలయాలలోని గ్రంథాలను ఎలా కాల్చివేశారో, హిందూ సాహిత్యాన్ని ఆ విధంగా ఈ శక్తులు కాల్చివేస్తాయి.

అందుకే భవిష్యత్తులో వచ్చే ఈ ప్రమాదాన్ని గుర్తించండని విశ్లేషణాత్మకంగా దిబ్రేక్ ఇండియా గ్రంథాన్ని రాహుల్ మల్హోత్రా రచించారు. అది అన్ని భాషల్లోకి వచ్చింది. హిందూ వ్యతిరేక భావజాలంతో కంచెఐలయ్య కూడా హిందూ మతానందర భారతదేశం అనే గ్రంథాన్ని వ్రాశాడు. హిందుత్వం గొప్ప తనాన్ని గుర్తించిన స్వామి శివానంద సరస్వతీ మహారాజ్ హిందుత్వ సమగ్రదర్శనం గ్రంథాన్ని అందించారు.

ఇవన్నీ హిందూయువత చదవాలి ; వీటిని గూర్చి చర్చించాలి. హిందుత్వ అస్తిత్వం నిమిత్తం ఎవరెవరు ఏంచేయాలి అని ఆలోచించాలి. ఆ దిశలో జనాన్ని సంసిద్ధంచేయాలి. ఆ దిశలో ఎవరు పూనుకొన్నా మిగతా వారు వారికి సహకరించాలి. **ఆచార్య కసిరెడ్డి**

అనందలో నీలోనే వుంది. స్వయంగా నీవు ఆనంద స్వరూపడవు ఈ సత్యాన్ని గ్రహించి నీ జీవితంపై పరమానందం అన్న కిరీటాన్ని పెట్టు

* * *

ఒక అందమైన చిత్రాన్ని చూస్తే ఆ చిత్రకారుడు జ్ఞాపకం వస్తాడు. శావ్రమైన భజన వింటే ఆ గాయకుడు జ్ఞాపకం వస్తాడు. నీవు ప్రతి రోజు చూసే ఈ అత్యద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించిన భగవంతుణ్ణి మరిచిపోతే ఎలా ?

* * *

నిజమైన త్యాగం బాహ్యక్రియ కాదు. అదొక అంతరంగ కర్మ. నీలోని అపవిత్రమైన కోరికలను, కామాన్ని, కోపాన్ని, ఆత్మను అద్వైవికమైన భావాలను తొలగించకోవడమే నిజమైన త్యాగం

మనిషి విజయం సంపాదించిన డబ్బుపట్టికాక, సాధించిన మనశ్శాంతిని బట్టి వుంటుంది

# హిందూ ధర్మ సమగ్ర స్వరూపం

(ALL ABOUT HINDUISM)

## మూడో అధ్యాయం

*(గత సంచిక తరువాయి)*

## హిందూ ధర్మం

**- శ్రీ స్వామి శివానంద**

### బ్రహ్మచర్యం

బ్రహ్మచర్యం ప్రాథమిక దశ. విద్యాభ్యాసం, క్రమశిక్షణ అలవర్చుకునే సమయం. ఈ దశలో విద్యార్థి ఎలాంటి సుఖాలలో పాల్గొనరాదు. గురుకులంలో నివసిస్తూ వేద శాస్త్రాధ్యయనం చేయాలి. ఇది పరీక్షాసమయం. ప్రాచీనకాలంలో గురువులు అరణ్యాలలోని ఆశ్రమంలో నివసించేవారు. ఈ ఆశ్రమాలే గురుకులాలు, అరణ్యంలోని విశ్వవిద్యాలయాలు. విద్యార్థి ఆహారం కొరకు భిక్షాటన చేసేవాడు. ధనికులు, పేదల పిల్లలు కలిసి మెలిసి నివసించేవారు. ప్రతి విద్యార్థి తన గురువును ఆధ్యాత్మిక పితగా భావించి శ్రద్ధ, భక్తి, గౌరవాలతో సేవించేవాడు. ప్రతి విద్యార్థి బ్రహ్మచర్య జీవితం ఉపనయన సంస్కారంతో మొదలౌతుంది. అది అతని రెండో జన్మ. అతనికి దృఢమైన, సామాన్యమైన అలవాట్లు వుంటాయి. వేకువజామున లేచి, స్నానం చేసి, సంధ్యావందనం, గాయత్రీ జపం చేస్తాడు. వేదాధ్యయనం చేస్తాడు. అతి సామాన్యమైన ఆహారం మితంగా సేవిస్తూ, విస్తృత శరీరవ్యాయామం చేస్తాడు. నేలపై చాప వేసుకొని పడుకుంటాడు. మెత్తని పరుపులు, తలగడలు వాడడు. అణకువతో విధేయుడై వుంటాడు. తన కన్నా పెద్దవారిని గౌరవిస్తాడు. వారి సేవ చేస్తాడు. మనసా, వాచా, కర్మణా శుచిగా వుండాలని ప్రయత్నం చేస్తాడు.

నిరంతరం గురుసేవలో నిమగ్నమై వుంటాడు. మద్యపానం, మాంసాహారం, సుగంధద్రవ్యాలు, పూలదండలు, రుచికరమైన ఆహారం, స్త్రీసాంగత్యానికి, జీవహింసకు దూరంగా వుంటాడు. కామ, క్రోధం, లోభం, నృత్యం, పాటలు, సంగీతవాయిద్యాలు, పేకాట, వ్యర్థసంభాషణ, అసత్యం, పరదూషణకు దూరంగా వుంటాడు.

**మనుషుల నిజాయితీ వారి వృత్తివలన కాక, ప్రవృత్తివలన బయటపడుతుంది**

విద్యాభ్యాసం తరువాత తన శక్త్యానుసారం గురుదక్షిణ సమర్పించి గృహస్థాశ్రమం స్వీకరించడానికి తన ఇంటికి తిరిగి వస్తాడు. విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత స్నాతకోత్సవంలో గురువు తన అంతిమ ఉపదేశాలనిచ్చి విద్యార్థులను వారి వారి స్వస్థానాలకు పంపుతాడు. ఆ ఉపదేశాలు "సత్యమే మాట్లాడు. విధినిర్వహణ నుంచి, వేదాధ్యయనం నుంచి, సత్యం నుంచి, కర్తవ్యాల నుంచి, విముఖడవు కావద్దు. సంతానాభివృద్ధిని ఆపకు నీ శ్రేయస్సు, నీ అభివృద్ధి, వేదపఠనం, బోధనలో అశ్రద్ధ చేయకు. దేవతల పట్ల, పితరులపట్ల నీ ధర్మాన్ని విస్మరించకు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథిదేవోభవ అన్న సూత్రాలను పాటించు. ఎలాంటి దోషంలేని సత్కార్యాలను ఆచరించు.

"నీ కన్నా శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు తగిన ఆసనం మొదలైన వాటిని సమర్పించి వారి సేద తీర్చు. శ్రద్ధాభక్తులతో, అణకువతో, సానుభూతితో దానధర్మాలు చేయి. కర్తవ్యనిర్వహణలో సంశయం వుంటే మహాపురుషుల జీవితాలను గమనించి వారి దృష్టాంతాలను అనుసరించు. ఇదే ఆదేశం, ఇదే ఉపదేశం, ఇదే భగవంతుడి ఆజ్ఞ, దీన్ని శ్రద్ధాభక్తులతో పాటించు, వీటిపై ధ్యానం చేయి". ఇదే గురువు గారి చివరి సందేశం.

## గార్హస్థ్యం

రెండో దశ గృహస్థాశ్రమం. విద్యాభ్యాసం పూర్తిచేసిన, తర్వాత గృహస్థాశ్రమ బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా వున్నప్పుడు వివాహం చేసుకొని గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తారు. అన్ని ఆశ్రమాలలోకి అతిముఖ్యమైన ఆశ్రమంఐన గృహస్థాశ్రమం మిగతా ఆశ్రమాలను పోషిస్తుంది, భరిస్తుంది. జీవరాసులన్నీ వాయువు మీద ఆధారపడినట్లే ఇతర ఆశ్రమాలు, శాఖలు గృహస్థుపై ఆధారపడతాయి. నదులన్నీ సముద్రంవైపు ప్రవహించినట్లే అన్ని ఆశ్రమాలు గృహస్థాశ్రమం వైపు వెళతాయి. ఆర్యుల జీవనానికి హృదయం వంటివాడు గృహస్థు అతడిపైనే సర్వం ఆధారపడి వుంటుంది.

హిందువుకు వివాహం అతి పవిత్రమైంది, భార్య అతడి జీవిత భాగస్వామి, అర్థాంగి. భార్య లేనిదే ఎలాంటి ధర్మకార్యాన్ని చేయలేడు. అన్ని ధర్మకార్యాలలో భార్య అతడి ప్రక్కనే వుంటుంది. సీతారాములను ఆదర్శదంపతులుగా అందుకే అందరూ భావిస్తారు. ప్రతి గృహస్థు నిజాయితీతో ధనార్జన చేయాలి. దాన్ని సక్రమ వినియోగం చేయాలి. తన ఆదాయంలో పదిశాతం దానధర్మాలకు ఇవ్వాలి. ధర్మబద్ధంగా ఇంద్రియ సుఖాలను అనుభవించాలి. పంచమహాయజ్ఞాలు చేయాలి.

**మంచి ఆశయంతో, దృక్పథంతో జీవించే వ్యక్తి ఇతరులకు ఆదర్శమవుతాడు**

**దేవయజ్ఞం** – వేద మంత్రాల పఠనంతో దేవతలకు ఆహుతుల సమర్పణ

**ఋషి యజ్ఞం** – వేదాధ్యయనం, వేద బోధన, ఋషులకు ఆహుతుల సమర్పణ,

**పితృయజ్ఞం** – పితృదేవతలకు తర్పణం వదలడం, ప్రతి సంవత్సరం శ్రాద్ధం పెట్టడం.

**భూతయజ్ఞం** – గోవులకు, ఇతర జీవులకు ఆహారం ఇవ్వడం.

**అతిథి యజ్ఞం** – అతిథులను గౌరవించడం, వారికి భోజన సదుపాయాలు చేయడం.

అతిథిసత్కారం, ఆతిథ్యం ప్రతి గృహస్థు ముఖ్యమైన విధుల్లో ఒకటి. అతిథులకు, బ్రాహ్మణులకు, బంధువులకు భోజనం పెట్టి తాను భుజించాలి. ఇంటి ఇల్లాలు ఆ తర్వాత భోంచేయాలి.

తన కుమారులు బాధ్యతలను స్వీకరించే దశకు చేరుకున్నారని తెలుసికొని, తనకు మనవలు కలగగానే తను, తన భార్య ప్రాపంచిక విషయాల నుంచి విరమించి గ్రంథపఠనంలో, ధ్యానంలో జీవితం గడపాల్సిన సమయం ఆసన్నమయిందని గుర్తించాలి.

## వానప్రస్థం

మూడవదశ వానప్రస్థం. గృహస్థాశ్రమం స్వీకరించడానికి సన్నాహం బ్రహ్మచర్యమైతే, సన్యాసం స్వీకరించడానికి సన్నాహం వానప్రస్థం. గార్హస్థ్య జీవితంలోని బాధ్యతలను సక్రమంగా నిర్వహించిన తర్వాత అరణ్యాలకు కాని ఏకాంత ప్రదేశానికి కాని వెళ్ళి ఉన్నతమైన ఆధ్యాత్మికవిషయాలపై ధ్యానంచేయడం ప్రారంభించాలి. అతడు సామాజిక బంధాలనుంచి, జీవితంలోని బాధ్యతల నుంచి స్వేచ్ఛ పొందాలి. అతడికి ధార్మికగ్రంథాలు చదవడానికి తగిన సమయం వుంది. అతని భార్య, భర్త వెంట వెళ్ళవచ్చు లేదా కుమారుల వద్ద వుండిపోవచ్చు.

## సన్యాసం

చివరిదైన నాలుగో దశ సన్యాసం. సన్యాసం స్వీకరించిన వ్యక్తి తన అధీనంలో వున్న వస్తుసంపదలను, తన కులవర్ణాలను, కర్మకాండలను, దేశం, మతం వంటి బంధాలను త్యజిస్తాడు. ఏకాంతంగా జీవిస్తూ తన సమయాన్ని ధ్యానంలో గడుపుతాడు. భిక్షాటన చేస్తూ జీవిస్తాడు. ఉత్కృష్టమైన దీర్ఘధ్యానదశకు చేరుకోగానే ఆత్మానందం అనుభవిస్తాడు.

**ఇతరులకు మంచి చేయడంలో ఆనందపడేవాడే నిజమైన మనిషి**

ఇంద్రియసుఖాలకు, ఇష్టాఇష్టాలకు, కోరికలకు, అహంకారానికి, కామక్రోధాలకు, లోభానికి, గర్వానికి దూరంగా వుంటాడు. సమదృష్టి, సమతుల్యమైన మనస్సుతో అందరినీ ప్రేమిస్తాడు. సంతోషంగా సంచారంచేస్తూ బ్రహ్మజ్ఞానాన్ని, ఆత్మజ్ఞానాన్ని విస్తరింపచేస్తాడు. మానావమానాలలో, నిందాస్తుతులలో, జయా పజయాలలో సమభావనతో వుంటాడు. అతడిప్పుడు అతివర్ణాశ్రమి – వర్ణాశ్రమాలకు అతీతుడు. అతడు ఎలాంటి సాంఘిక ఆచారాలకు, సాంప్రదాయాలకు కట్టుబడకుండా స్వేచ్ఛగా జీవించే వ్యక్తి. ఇలాంటి సన్యాసి ఆదర్శవంతమైన వ్యక్తి. స్వేచ్ఛ, సంపూర్ణత్వం పొందిన వ్యక్తి. అతడు స్వయంగా బ్రహ్మమే. అతడు జీవన్ముక్తుడు. ఈ భూమిపై నడయాడే భగవంతుడిలాంటి ఈ మహాత్ముడికి జోహార్లు!

## ఆధునిక పరిస్థితుల్లో ఆశ్రమ ధర్మం

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాచీన నియమాలననుసరించి ఆశ్రమ ధర్మాలను పాటించడం కష్టం. కాని వాటి భావాలను పునరుద్ధరించి నేటి మారిన పరిస్థితుల కనుగుణంగా మార్చుకొని, పాటిస్తూ, ఆధునిక జీవనాన్ని అభివృద్ధి చేసుకోవచ్చును. ఒక దశలోని విధులను మరో దశలో వున్నవారు ఆచరించడానికి ప్రయత్నించకూడదు. ఒక బ్రహ్మచారి గృహస్థధర్మాలను కాని సన్యాసధర్మాలను కాని పాటించకూడదు. అదేవిధంగా ఒక గృహస్థు, బ్రహ్మచర్యం, వానప్రస్థ, సన్యాస ధర్మాలను పాటించవద్దు. ఒక సన్యాసి గృహస్థాశ్రమ సుఖాలను ఆశించకూడదు. ప్రతి వారు తమతమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తే సమాజంలో శాంతి భద్రతలు కలుగుతాయి. వర్ణాశ్రమవ్యవస్థ తొలగిస్తే సామాజికబాధ్యతల మూలాన్ని నరికినట్లవుతుంది. వర్ణాశ్రమధర్మాలను పాటించకుండా దేశం ఎలా మనగలదు?

పాఠశాలల్లో, కాలేజీల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు స్వచ్ఛమైన, సరళమైన జీవనం గడపాలి. ఒక గృహస్థు ఆదర్శవంతంగా జీవించాలి. ఆత్మనిగ్రహం, దయ, క్షమ, అహింస, సత్యసంధతలను పాటిస్తూ సమతుల్యమైన జీవితం గడపాలి. వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు పాటించడం కష్టమని తలిచే వారు బ్రహ్మ చర్య, గృహస్థాశ్రమాలలో వుంటూ క్రమంగా లౌకికజీవనం నుండి తప్పుకొని నిస్వార్థసేవ, గ్రంథపఠనం, ధ్యానంలో తమ సమయాన్నిగడపాలి.

## అత్యున్నతమైన దశ

వర్ణాశ్రమాలు శరీరానికే కాని శుద్ధమైన, సర్వవ్యాప్తమైన, అమరమైన ఆత్మకుకాదు. ఆత్మజ్ఞానాన్ని సాధించి భగవాన్ దత్తాత్రేయుడిలాగా అతివర్ణాశ్రమిగా మారాలి. పరమాత్మ ఏమి చెబుతాడో వినండి.

**ఒక మనిషిని అతని ఆత్మ విశ్వాసమే అద్భుతమైన ప్రేరణ**

**"మహదాది జగత్ సర్వమ్ న కించిత్ ప్రతిభాతి యే,**
**బ్రహ్మైవ కేవలమ్ సర్వమ్ కథం వర్ణాశ్రమ స్థితిః"**

"మహత్ నుంచి క్రిందివరకు సమస్త జగత్తు నాలో ప్రకాశించదు. సర్వం బ్రహ్మమే. మరి వర్ణాశ్రమం ఎక్కడుంది?" మీరందరు వర్ణాశ్రమ ధర్మాలను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలి గాక! మీరంతా విశ్వప్రేమ, సౌభ్రాతృత్వాలను అలవర్చుకుంటారుగాక! మానవుడు స్వార్థబుద్ధితో సృష్టించిన హెచ్చుతగ్గులు, విరోధాలు, అనైక్యతలనే అవరోధాలు నశించి పోవుగాక!

## యుగధర్మం

స్వర్ణయుగమైన సత్యయుగంలో కొన్నిరకాల ధర్మాలు, నియమాలు వుండేవి. త్రేతాయుగంలో అవి మరోరూపం ధరించాయి. ద్వాపర యుగంలోని ధర్మాలు మిగతా యుగాలలోని ధర్మాలకన్నా వేరుగా వుండేవి. కలియుగంతో అవి వేరు రూపాలు ధరించాయి. యుగాలు మారిన కొద్దీ ధర్మాలు మారుతాయి. మానవుడిలో మార్పు కలుగుతుంది. వివిధ అనుభవాలద్వారా అతడి స్వభావంలో మార్పు వస్తుంది. అందువల్ల, అతడి ధర్మపు భౌతికరూపంలో కూడా మార్పురావాలి.

సత్యయుగంలో ధ్యానంద్వారా, త్రేతాయుగంలో యజ్ఞయాగాదులద్వారా, ద్వాపర యుగంలో హరిభక్తి ద్వారా సాధించిన దాన్ని కలియుగంలో విష్ణునామ సంకీర్తన ద్వారా సాధించవచ్చును. సత్యయుగంలో అందరి మనస్సులు స్వచ్ఛంగా ఉండేవి. మనస్సును పెడద్రోవను పట్టించే ఆకర్షణలు లేవు. సినిమాలు, హోటళ్ళు, నృత్య మందిరాలు లాంటి ఆకర్షణలు లేవు. అందువల్ల వారికి ధ్యానం సులభం, స్వాభావికం. సత్యయుగనివాసులకు యజ్ఞయాగాదులు, క్రతువులు, చేయడానికి అవసరమైన సామగ్రి సమృద్ధిగా లభించేది. మనషులు సక్రియులై, ఉల్లాసంగా వుండేవారు. అందుకే వారికి అగ్నిహోత్ర, జ్యోతిష్టోమ, దర్శపౌర్ణమిలాంటి యజ్ఞాలు చేయడం పరిపాటిగా మారింది. ఆ కారణంవల్ల ఆ యుగంలో సనాతనధర్మానికి బాహ్యరూపం యజ్ఞం అని చెప్పుకునేవారు. ద్వాపర యుగంలో అవతారాలు దర్శనమిచ్చాయి. భగవంతుణ్ణి ప్రత్యక్షంగా పూజించడం సులభమయ్యింది. అందుకే ఆ యుగంలో భగవంతుణ్ణి పూజించడమే ముఖ్యసాధనగా నిర్ణయించారు. కలియుగంలో మనస్సును వికలంచేసే ఆకర్షణలు ఎన్నో ఉన్నాయి. ప్రజల్లో బ్రహ్మచర్యపాలన, సంకల్పశక్తి, విచక్షణాజ్ఞానం

**ఫలితంపైన కన్నా, చేసే పనిపై దృష్టి పెడితేనే విజయం సాధించవచ్చు**

నశించాయి. యజ్ఞయాగాదులు చేయడానికి అవసరమైన సామాగ్రి సమకూర్చడం చాలా కష్టం. అందువల్ల కలియుగంలో హరినామ సంకీర్తన, మానవాళికి నిస్వార్థసేవ ముఖ్యమైన సాధనాలు.

## ఉపసంహారం

పట్టుదల, ఉత్సాహంతో నీ ధర్మాన్ని పాటించు. నీ విధులను శ్రద్ధాభక్తులతో నిర్వర్తించు. ధర్మాచరణకు అనుగుణమైన సద్గుణాలను అలవర్చుకో. ధర్మపథం నుంచి ఒక్క అంగుళం కూడా ప్రక్కకు జరగకు. మనఃపూర్వకంగా, నిండుహృదయంతో, ఆత్మసాక్షిగా ధర్మానికి కట్టుబడి జీవించు. స్వధర్మనిర్వహణ వల్ల సుఖసంతోషాలు, సత్వర ఉన్నతి, స్వేచ్ఛ లభిస్తాయి. క్రమంగా నీవు అమరత్వాన్ని, శాశ్వతానందాన్ని, పరమశాంతిని, అనంతమైన ఆహ్లాదాన్ని పూర్ణ స్వేచ్ఛను, సంపూర్ణత్వాన్ని అనుభవిస్తావు. నీకు శాశ్వతానందం, శాశ్వతశాంతి అనే సామ్రాజ్యానికి మార్గం చూపే ధర్మమనే దివ్యతేజస్సుకు జోహార్లు!

హిందూధర్మమనే శాశ్వతధర్మం ఎల్లకాలం సుస్థిరంగా వుండాలి గాక! నిజమైన ప్రేమ అనే బంధంతో హిందువులందరూ ఏకం కావాలి గాక! *(సశేషం)*

## శ్రీ లక్ష్మీ నరసింహా - యాదగిరి

నరసింహ లక్ష్మీ నరసింహా యాదగిరి – శ్రీ లక్ష్మీ నరసింహ యాదగిరి ॥న॥

1) చేకొనరావయ్య సాష్టాంగ దండాలు – తీర్చగరావయ్య మా యొక్క గండాలు
అర్పించెదమయ్య ఆపద మ్రొక్కులు – అభయహస్తమిచ్చి ఆదుకోవయ్య॥న॥

2) నిత్య పూజిత నిర్మల హృదయ – పేదల పాలిటి అభయ అభయ
వైకుంఠ పురవాస ఆనందనిలయ – మేమింత వేడిన దయరాదేమయ ॥న॥

3) సర్వమంగళా పాహిమురారా – భక్తుల పాలిటి భజగోవిందా
పాహిపాహి ప్రబోధ ప్రహ్లాద వరదా – దాసపెద్దిరాజుని దయగనరాదా ॥న॥

– వేల్పుల పెద్ది రాజయ్య

చెప్పినవేళకు రానివాడు, కాలం విలువ తెలియనివాడు ఎప్పటికీ నిజాయితీ పరుడుకాలేడు

జీవన భారతి

# భావ పరిణతి

## వ్యష్టి దృష్టి

**మూలం : స్వామి దయానంద సరస్వతి** **సేకరణ : స్వామి సర్వవిదానంద**

*(గత సంచిక తరువాయి)*

తీరని రాగద్వేషములనేకములు నీతోనే ఉండి పోయాయి – కొన్ని ఛిన్నాభిన్నములయాయి. కొన్ని వ్యధకులోనైనవి, కొన్ని గాయపడినవి. రక్తం కారుతున్నవి. కొన్ని చిలవలు పలవలుగా పెరుగుతూ ఉన్నవి. అవి నీ దృష్టిని వక్రీకరిస్తాయి. ఫలితంగా ప్రపంచాన్ని నీవు యధాతథంగా చూడబోవటం లేదు. భయము, ఆందోళన, అభద్రతా భావన, ఆత్రుత – ఇవన్నీ దృష్టిని దోషమయంగా చేస్తాయి. ఆ విధంగా నీవీశ్వర సృష్టితో వ్యవహరించవు – జీవ సృష్టితోనే – నీ వ్యక్తిగత దృష్టి సృష్టించిన దానితోనే తలపడతావు. సమస్యలు వాస్తవమైనవుతే వాటిని నీ వెదుర్కోవచ్చు. కానీ భయాలు ఆందోళనలు, ఆత్రుతలు మొదలైనవన్నీ నీవు సృష్టించుకున్నవే – నీ వ్యక్తిగత దృష్టికి ఫలితములే. మరో మాటల్లో చెప్పాలంటే వాస్తవాలను నీ వరుదుగా ఎదుర్కొంటావు. సరిపుచ్చుకోవాల్సివచ్చేది. ఆ విధంగా పిల్లవాడిగా ఉన్నప్పుడు నీవెదుర్కొనేదల్లా వాస్తవాలని నీవనుకునే వాటిని మాత్రమే దీనినే అనుభవాత్మక సమస్య అని, వ్యక్తిగత దృష్టి సమస్య అని అంటుంటారు.

ఒకటికి ఒకటి కలిపితే రెండన్నది అనుభవైక సత్యం. ఇది పుష్పం – సత్యం. ఇది గులాబి పుష్పం – సత్యం. కానీ నీవే విధంగా చూస్తావన్నది వేరే విషయం. కొండలు, కోనలు, ఆకాశము, నక్షత్రములు, చంద్రుడు మొ॥ వాటితో నీవున్నప్పుడు – ప్రకృతితో నీవున్నప్పుడు – నీ వ్యక్తిగత దృష్టి ఉండనే ఉండదు నీవాకాశాన్ని చూచినప్పుడు అది భిన్నంగా ఉండాలని ఆశించవు. ఆకాశాన్ని యథాతథంగా స్వీకరిస్తావు – అది పచ్చగానో మరో విధంగానో ఉండాలనాశించవు. అప్పుడు వస్తుదృష్టి మాత్రమే ఉంటుంది. ఎలా ఉంటే అలాగే గ్రహిస్తావు. ఆకాశం, నక్షత్రములు, పక్షులు, పొదలు, వృక్షములు, పుష్పములు అన్నింటిని యథాతథంగా స్వీకరిస్తావు. ఉన్నదాని కంటే, బిన్నంగా ఆశించవు. ఆకాశాన్ని యథాతథంగా స్వీకరిస్తావు – అది పచ్చగానో మరో విధంగానో ఉండాలనాశించవు. అప్పుడు వస్తుదృష్టి మాత్రమే ఉంటుంది – ఎలా ఉంటే అలాగే గ్రహిస్తావు. ఆకాశం, నక్షత్రములు, పక్షులు, పొదలు, వృక్షములు, పుష్పములు అన్నింటిని యథాతథంగా స్వీకరిస్తావు.

**వ్యక్తిత్వం మీద ఆధారపడ్డ వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటాడు**

ఉన్నదానికంటే, భిన్నంగా ఉండాలనాశించవు. నీవు ప్రకృతితో ఉన్నప్పుడు నీ వ్యక్తిగత దృష్టి ఏ మాత్రం లేకుండా ఉండటం గమనిస్తావు. అంటే ఏ కనుగుణంగా అర్థాలు చెప్పటం లేదు. నీ కనుగుణంగా వివరణ ఇవ్వనంతవరకు అంతా బాగానే ఉంటుంది. నీ భయపడే మనస్సు, ఆత్రుతపడే మనస్సు, వాంఛించే మనస్సు, పనిచేసి నీ దృష్టిని కలుషితం చేయనంతవరకు అంతా అందంగాను కాంతిమయంగాను గోచరిస్తుంది.

పసిబిడ్డను నీ చేతుల్లోకి తీసికొని లాలించేటప్పుడు – భవిష్యత్తు, ఆరోగ్యం మొదలైన వాటి గురించి ఆలోచించనంతవరకు నీవా బిడ్డనుండి ఆనందాన్ని పొందుతావు. కానీ ఆ బిడ్డ గురించి చింతించడం మొదలైన మరుక్షణం పరిస్థితి మారిపోతుంది. ఆ బిడ్డ ఉల్లాసంగా ఆడుకోవాలని, ఏడవకూడదని ఈ విధంగా ఎన్నో రకాలుగా నీ వాశించవచ్చు. అప్పుడది పూర్తిగా భిన్నమైనది అలా ఆలోచించటమే కలుషితం కావటమంటే నీవింక ఆ పసివాని నుండి ఆనందాన్ని పొందలేవు.

కొన్ని పరిస్థితులలోనే నేను వాస్తవాలను యధాతథంగా చూస్తాను. కానీ అవే పరిస్థితులు కొంతమంది వ్యక్తులతోనో లేక నా జీవితానికే ముడిపడి ఉంటే వాస్తవ దృష్టిని కోల్పోతాను. నా రాగద్వేషముల అదుపాజ్ఞలలో ఉన్న నా మనస్సు కల్పించిన పరిస్థితులనెదుర్కొంటాను. కనుక రాగద్వేషముల గురించిన అవగాహన, వాటికిచ్చే విలువ వాటికివ్వటం, వాటి ప్రభావానికిలోను గాకుండా వాటినదుపులో ఉంచగలగడం – ఇదీ భావపరిణతంటే. భగవద్గీత బోధిస్తున్నది కూడా ఇదే. అందుచేతనే గీతా బోధ సమగ్రమైనదనే నా అభిప్రాయం. మనస్సునదుపులో నుంచటానికి మరో సాదన కోసం చూడనవసరంలేదు.

రాగద్వేషముల మూలంగా కలిగిన భయాందోళలనకు లోనై వ్యవహరిస్తే అప్పుడుండేది జీవ సృష్టే గాని ఈశ్వర సృష్టికాదు. వ్యవహారయోగ్యమై మనకందించబడినది ఈశ్వర సృష్టి. నా భయాందోళలన మొదలైన వాటిచేత నా దృష్టిని కలుషితంచేసుకుంటే, అప్పుడు నా ప్రపంచంలో నేనుంటాను.

వ్యాపారంలో తీవ్ర నష్టం వచ్చిందనుకుందాం. షేర్ల క్రయ విక్రయంగా బాగా దెబ్బతిని ఘోరమైన పరిస్థితేర్పడింది. ఆ పరిస్థితి నెంత వాస్తవిక దృష్టితో చూస్తానన్నది ఇక్కడ ప్రాముఖ్యత వహిస్తున్నది. నావంతుగా అప్పుడు సరైన రీతిలో వ్యవహరించాల్సిన అవసరమున్నది. వాస్తవిక దృష్టితో వ్యవహరించాలి. అదే విధంగా ఆప్తులు మరణించినప్పుడుగానీ, అవమానాలకు గురయినప్పుడు, భద్రత లోపించినప్పుడు – మొదలైన ఏ పరిస్థితులలోనైనా నేను వాస్తవిక దృష్టితో ఉండాలి. ఓ కొండనో, గుట్టనో, వాగునో చూచినపుడెంత వాస్తవిక దృష్టితో ఉంటానో అలా ఉండగలగాలి. *(సశేషం)*

**అందం నడవడికలో ఉంటుంది, ఆడంబరాలలో కాదు**

సందేశ భారతి

# దివ్యజనని శారదాదేవి స్వరూపము - సందేశములు

**- శ్రీమతి బొప్పన అరుణాదేవి**

సంగమం వలన పవిత్రతా, ధార్మికతా, ఆధ్యాత్మిక శక్తి మరింతగా ఇనుమడిస్తాయని త్రివేణి సంగమం ఋజువుచేస్తుంది. తీర్థస్థలాలు ఎన్ని ఉన్నా త్రివేణి సంగమం ప్రత్యేకత వేరు. గంగా, యమునా, సరస్వతీ నదులు సంగమించటం వలన ఆ స్థలానికి ఆ పవిత్రత చేకూరింది. ఆధ్యాత్మిక సంస్థలు అనేకం ఉన్నప్పటికీ శ్రీ రామకృష్ణ, శ్రీ శారదమాత, శ్రీ వివేకాంనదుల సమిష్టి శక్తి పనిచేస్తున్నది అన్నది యదార్థం.

అవతారిష్టులయిన శ్రీ రామకృష్ణులు వష్ణుస్వరూపలు, పరమపావనము అయిన గంగానది వంటివారు. వారి దివ్యోపదేశములతో ఎందరో జిజ్ఞాసువులు సాధకులు తరించారు. ఉత్తుంగ తరంగాలతో, భీషణ ఘర్జనలు గావిస్తూ ఎగిసిపడే యమునానదిలా శ్రీ వివేకానందులు శివస్వరూపులై అలరారుతూ దేశవిదేశాలతో తమ ఆధ్యాత్మిక సందేశ తరంగాలతో సనాతన ధర్మాన్ని ప్రచారంచేసి యువతను ఉత్తేజితులను గావిస్తూ వారిలో సంపూర్ణమయిన ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, దేశభక్తిని నింపి వారికి చక్కగా మార్గనిర్దేశం గావించారు. వీరిరువురికి భిన్నంగా మాతృదేవి అంతర్వాహిని అయిన జ్ఞానసరస్వతిలా నిరాడంబర జీవితాన్ని గడుపుతూ వారు వీరు అని చూడక సకల జనులకు మార్గోపదేశం చేస్తూ పండితపామరులను, సాధుసజ్జనులను స్త్రీ పురుష బాలలను, గృహస్థులు, బ్రహ్మచారులు, సన్న్యాసులు అనే తారతమ్యంలేక, మతభేదము పాటించక, విదేశీయులను సైతం తశ్రీన బిడ్డలుగా భావించి వారిపై మాతృప్రేమను వర్షిస్తూ గురుదేవిగా భాసించారు.

వేద పురాణ ఇతిహాస కాలాలలో స్త్రీ శక్తి అనేక రూపాలలో ప్రకటితమయింది. ఆ శక్తి వేదాంతసభలలో చర్చలు జరిపింది. ఆచార్యులను సైతం తన వాదనాపటిమతో నిరత్తులను చేయగలిగింది. జనకమహారాజుని శోధించగలిగింది. యుద్ధరంగంలో కదం త్రొక్కింది. సాహిత్య సౌరభాలను వెదజల్లింది. భక్తి పారవశ్యంతో సంకీర్తనలు చేసింది. ఆర్తులను ప్రేమతో ఆదరించింది. అంధమూఢ విశ్వాసాలను ఎదరించి నిలిచింది. ఇన్ని విధాలుగా ప్రకటితమయిన ఆ జ్ఞానశక్తి, క్రియాశక్తి, ఇచ్ఛాశక్తి నేడు వినయంగా, నమ్రతతో ఒద్దికగా

**దృఢమైన సంకల్పం, స్థిరమైన కృషి ఉంటే విజయం తప్పక లభిస్తుంది**

ఒదిగి అతి నిరాడంబరంగా గూఢంగా ఉంటూనే ఆదర్శవంతమయిన అత్యద్భుతమయిన తేజోమూర్తిగా, ఆధ్యాత్మిక శక్తిగా అవతరించి అనుష్ఠానవేదాంతానికి నిజమయిన ఆధ్యాత్మికతకు ప్రతీగా నిలిచింది. ఆ శక్తి శ్రీ శారదాదేవిగా ఇలలో అవతరించింది.

జ్ఞాన సరస్వతి దివ్యజనని రూపంలో భౌతికరూపం దాల్చి ఈ భూమి మీద అరవై ఆరు సంవత్సరాలు తిరుగాడింది. ఎందరికో మంత్రదీక్షనిచ్చి జ్ఞానభిక్షను ప్రసాదించింది. ఆమె జీవితంలో మొదటి పదమూడు సంవత్సరాలు సాధారణంగానే గడిచిపోయాయి. భర్త, గురువు, దైవంగా భాసించిన శ్రీ రామకృష్ణుల సాంగత్యంలో ఆమెలో ఆధ్యాత్మిక బీజాలు నాటుకున్నది ఆమె పదమూడవ ఏటనే. అవి చక్కగా మొలకెత్తి ఫలవంతమయినది షోడశిపూజవల్ల. అప్పటి నుంచి గురుదేవుల నిర్వాణం వరకు ఆమె చేసిన సాధనలు లోకానికి వెల్లడి కాకుండా నిగూఢంగానే సాగాయి. శ్రీరామకృష్ణులు నిర్యాణం చెందేనాటికి ఆమె ముప్ఫైమూడు సంవత్సరాలు ప్రౌఢ వయస్సులో ఉన్నారు. ఆ తర్వాత ఆమె ముప్పదిమూడు సంవత్సరాలు జీవించినా, పదమూడు సంవత్సరాలు తీవ్రమయిన సాధనలోనూ, తపస్సులోనూ గడిపారు. జయరాంబాటి, కామర్పకూరు, కలకత్తా మొదయిన ప్రదేశాలకు తిరుగుతూ జీవితం నిరాడండరంగా గడిపారు. చివరి ఇరువై సంవత్సరాలు ఆమె దివ్యత్వం, జ్ఞానతేజం లోకానికి, భక్తులకు ప్రస్ఫుటంగా వెల్లడయింది. జనం తండోపతండాలుగా ఆమె పాదసన్నిధిలోకి చేరి, జ్ఞానామృతాన్ని గ్రోలి, ఆమె మాతృప్రేమతో తడిచి పులకించిపోయారు.

మాతృదేవి పైకి భక్తిమార్గాన్ని అనుసరించినట్లుగా, సాకారపూజకు ప్రాధాన్యత నిచ్చినట్లుగా కనిపించినా అమ్మ నిజతత్త్వము అద్వైతమే. ఆమె పూర్తిగా అద్వైత స్థితిలో నెలకొని వుండి కూడా భక్తులకు లోకవ్యవహారంలో మునిగితేలుతున్నట్లుగా భ్రమకలిగించేవారు. జీవన్ముక్తస్థితి పొందినవారి ప్రవర్తనని సామాన్యులు అర్థం చేసుకోవడం కష్టం. మాతృదేవి స్వరూపాన్ని, స్వభావాన్ని, మహోన్నతమయిన ఆమె ఆత్మస్థితిని సోదరి నివేదిత చక్కగా అర్థం చేసుకున్నారు. అందుకే ఆమె మాతృదేవి జీవితం నిరంతర ప్రార్థన అంటారు. ప్రార్థన మూలంగా తాను పొందిన సమాధానాన్నే పరమసత్యంగా, అంతిమ స్థితిగా ఆమె గ్రహించారు.

శ్రీ శారదాదేవి జీవితం శ్రీ రామకృష్ణులు, ఆయన సన్న్యాస గృహస్థ శిష్యులకు, భక్తులకు అంకితం చేశారు. శ్రీ రామకృష్ణమఠం సంఘ ఆవిర్భావం, దాని పురోగతిలోని ప్రతిమెట్టు అమ్మ కృపాకటాక్షంతోనే జరిగాయి. సంఘజనని అయిన శారదాదేవి సూచనల మేరకు ఆమె అజ్ఞానుసారమే సంఘం కార్యోన్ముఖమయి కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించగలిగింది. ఆ విధంగా సంఘానికి నిజమయిన సారథి మాతృదేవే అన్నది యథార్థం.

**చక్కటి క్రమశిక్షణతో, పట్టుదలతో పనిచేస్తే తగిన ఫలితాన్ని సాధిస్తాం**

"మహాశక్తిని మేల్కొల్పటానికే అమ్మ అవతరించింది. మాతృదేవిని ఆదర్శంగా తీసుకుని మళ్ళీ ఈ ప్రపంచంలో గార్గులు, మైత్రేయి జన్మిస్తారు. తండ్రి కృపకంటే నాకు తల్లి కృపే విలువైనది" అన్నారు స్వామిజీ.

"తనంతట తాను తెల్పనిచో అమ్మను గుర్తించటంత అసాధ్యం. శ్రీ రామకృష్ణులు అనుగ్రహిస్తేనే ఎవరైనా ఆమెను ఒకింత గ్రహించవచ్చు" అని బ్రహ్మానంద స్వామి చెప్పినట్లుగా దివ్యజనని సామాన్యురాలు కాదు. ఆమె స్వయం సరస్వతి. సంసారకూపంలో నరకయాతనలను అనుభవిస్తున్న నరులకు జ్ఞాన భిక్షను ప్రసాదించటం కోసం అవతరించినదామె.

"శ్రీ శారదా రామకృష్ణులు పరస్పర అనురాగం, ప్రేమ, సేవ, గౌరవంతో కూడిన నిరుపమానమయిన వైవాహిక జీవనం గడిపారు. భౌతిక సంబంధం లేకుండా, భౌతిక స్థాయిలో ఇద్దరూ వేర్వేరు వ్యక్తులుగా జీవించినా, ఆత్మల అసాధారణమైన కలయికకు వ్యక్తీకరణగా నిలిచి మానవ జాతికి సేవ చేశారు. కాళిదాసు వర్ణించినట్లుగా సృష్టికే మాతాపితలయిన శివపార్వతుల బాంధవ్యాన్ని వ్యక్తంచేసే పవిత్ర అనురాగాన్ని భారతదేశినికి నిరూపించారు" అని శ్రీ రంగనాధానంద స్వామిజీ అన్నారు. ఉన్నతమయిన ఆదర్శం ఉన్నప్పుడు భార్యాభర్తల అనుబంధం ఆదర్శప్రాయంగా నిలుస్తుంది.

భారతదేశ చరిత్రలో, సనాతన ధర్మంలో పతివ్రతా శిరోమణులయిన నారీమణుల తమ భర్తలను దైవంగా భావించి పూజించటం చూస్తాము. కాని శ్రీ రామకృష్ణులు అందుకు విరుద్ధంగా తన సహధర్మచారిణిని జగన్మాతగా, షోడశిగా, త్రిపురసుందరిగా, లలితాదేవిగా, దివ్యమాతగా భావించి పూజించి చరిత్ర సృష్టించారు. అప్పటి వరకూ ఆమెలో గర్భితంగా, నిగూఢంగా ఉన్న దివ్యత్వాన్ని వెలికితీసారు.

అవతారపురుషుల శక్తి యుగాలపర్యంతం విశ్వజనీనంగా పనిచేస్తుంది. శ్రీ రాముడు, శ్రీకృష్ణుడు, శ్రీ బుద్ధభగవానుడు మొదలయిన అవతారపురుషుల ప్రభావం నేటికి కూడా శక్తివంతంగా ప్రసరిస్తోంది. అలాగే మాతృదేవి విషయంలో కూడా ఇది వర్తించి తీరుతుంది. ఆధ్యాత్మిక చరిత్రలో అవతారపురుషులు అవతరించినప్పుడు ఇలాంటి స్త్రీ శక్తి పనిచేసినట్లు మనకు ఎలాంటి నిదర్శనాలు లేవు. కాని శ్రీ రామకృష్ణులు యుగధర్మ స్థాపనలో తనకు సహకరించేందుకు శ్రీ శారదాదేవిని ఎంచుకుని ఒక క్రొత్త ఒరవడిని చరిత్రను సృష్టించారు. అందుకే వారు మాతృదేవితో "నీ ద్వారా ఎంతో పని జరగవలసి ఉంది. అందుకే ఈ ప్రపంచంలో నిన్ను వదిలిపెట్టి వెళ్తున్నాను" అన్నారు.

*(సశేషం)*

**ఎవరు ఎంత ప్రలోభపెట్టినా సంకల్పాన్ని వదలకూడదు**

# ధ్యానానికి తొలి అర్హతలు

ఆంగ్లమూలం - స్వామి శివానంద    అనువాదం : తిప్పరాజు కొండలరావు

ధ్యాన సాధనకు సుశిక్షితమైన ఉపకరణం చాలా అవసరం. బ్రహ్మతత్త్వాన్ని, బ్రహ్మవస్తువును అర్థం చేసుకోవడానికి ప్రశాంతమైన స్పష్టమైన, స్వచ్ఛమై, సూక్ష్మమైన, తీక్షణమైన, నిశ్చలమైన, ఏకాగ్రత కలిగిన బుద్ధి ఉండాలి. అప్పుడు మాత్రమే సాక్షాత్కారం సాధ్యమవుతుంది. బ్రహ్మం స్వచ్ఛం, సూక్ష్మం. బ్రహ్మాన్ని చేరడానికి స్వచ్ఛమైన, సూక్ష్మమైన మనస్సు చాలా అవసరం.

సరైన శిక్షణ పొందిన మనస్సు మాత్రమే దేహాన్ని పూర్తిగా నియంత్రించి ధ్యాన సాధన చేయగలదు. జీవితాంతం ఒక్క క్షణం కూడా తన అన్వేషనను, తన ధ్యానాన్ని, బ్రహ్మాన్ని మరవకుండా, లౌకిక ఆకర్షణలకు తలొగ్గకుండా నిశ్చయంగా, స్థిరంగా సాధన చేయగలదు. ఏకాగ్రత ద్వారా, మనో నియంత్రణ ద్వారా భగవత్సాక్షాత్కారం పొందాలంటే అన్ని లౌకిక బంధాలను తొలగించుకోవాలి. దినపత్రిక పఠనం, స్నేహితులతో సల్లాపాలు, ఉత్తరప్రత్యుత్తరాలు పూర్తిగా మానివేయాలి. ఇవి మనస్సు పెడదారి పట్టించి లౌకిక భావాలతో నింపివేస్తాయి. ఐదారు సంవత్సరాలపాటు ఏకాంత జీవనం, తీవ్ర సాధన అనివార్యం.

ధ్యాన సాధన కొరకు సమస్తం సాత్వికంగా వుండాలి. ధ్యానం చేసే స్థలం, స్వీకరించే ఆహారం, ధరించే దుస్తులు సాత్వికాంగా వుండాలి. మీ సహవాసం, మీ మాట, మీరు వినే ధ్వనులు సాత్వికంగా వుండాలి. మీ ఆలోచనా విధానం, మీ అధ్యయనం, అంతా సాత్వికంగా వుండాలి. అప్పుడే సాధనలో పురోగతి సాధ్యం. ముఖ్యంగా నూతన సాధనలకు ఇదెంతో అవసరం.

మీరు భుజించే ఆహారం తేలికగా, సమృద్ధిగా, పోషక విలువలు కలిగి ఉండాలి. కడుపును అతిగా నింపవద్దు. మనస్సు నిండా సత్వగుణం నిండి ఉన్నప్పుడే ధ్యానం సాధ్యమవుతుంది. మనస్సుకు, తినే ఆహారానికి అవినాభావన సంబంధం ఉంది. ఎక్కువగా ఆహారాన్ని స్వీకరించడం హానికరం. ఉదయం పదొకండు గంటల సమయంలో పూర్తి ఆహారాన్ని భుజించి రాత్రివేళ అరలీటరు పాలు త్రాగాలి. ధ్యాన సాధకుల రాత్రి భోజనం చాలా తేలికగా వుండాలి.

**దుఃఖం అనేది శిక్షకాదు. సంతోషం అనేది స్వర్గమూ కాదు**

సాధన చేయడానికి తగిన సామర్థ్యం ఉండాలి. యోగాసనాలు దేహాన్ని స్థిర పరుస్తాయి. బంధాలు, ముద్రలు శరీరాన్ని దృఢ పరుస్తాయి. ప్రాణాయామం దేహాన్ని తేలికపరుస్తుంది. నాడీ శుద్ధి మనస్సుకు సామ్యావస్థ కలిగిస్తుంది. నిశ్చల పరుస్తుంది. ఈ లక్షణాలన్నింటినీ గడిచి బ్రహ్మంపై మనస్సును నిలపాలి. అప్పుడే ధ్యానం సులువుగా, సంతోషదాయకంగా సాగుతుంది.

గంభీరంగా తీక్షణంగా ధ్యానసాధనకు ఉపక్రమించే ముందు సక్రమ యోగాసనాల అభ్యాసం ద్వారా శరీరంపై సంపూర్ణ నియంత్రణ సాధించాలి. స్థిరాసనం లేకుండా మీరు ధ్యాన సాధన చేయలేరు, శరీరం నిలకడగా లేకుంటే మనస్సు కూడా నిలకడగా ఉండదు. శరీరాన్ని కొంచెం కూడా కదల్చవద్దు. దైనందిన అభ్యాసం ద్వారా ఆసనంపై అధికారం సారించాలి (ఆసన విజయం). ఒక రాయిలా, విగ్రహంలా నిశ్చలంగా వుండాలి. శరీరాన్ని, తలను, మెడను తిన్నగా నిలిపి వుంచితే వెన్నెముక కూడా తిన్నగా వుంటుంది. సుషుమ్నానాడి ద్వారా కుండలినీశక్తి క్రమంగా పైకి కదులుతుంది. నిద్రపై నియంత్రణ కలుగుతుంది.

ఆసనాలు భౌతిక శరీరానికి సంబంధించినవి. అవి శరీరాన్ని నిశ్చలంగా, దృఢంగా తయారు చేస్తాయి. శారీరక రోగాలు దూరమౌతాయి. బంధాలు ప్రాణానికి సంబంధించినవి. ఏది బంధిస్తుందో అది బంధం. బంధాలు ప్రాణాన్ని పైకి, అపానాన్ని క్రిందికి కదలనీయవు. అవి ప్రాణాన్ని, అపానాన్ని కలిపి బంధించి ప్రాణ అపానాలను సుషుమ్నానాడి ద్వారా పంపిస్తాయి. ముద్రలు మనస్సుకు సంబంధించినవి. ముద్ర అనగా గట్టిగా మూయడం, సీల్‌చేయడం. ముద్ర మనస్సును ఆత్మతో దృఢంగా కలిపి ఉంచుతుంది. ముద్రలు మనస్సు బాహ్య వస్తువుల పట్ల కదలనీయవు. బహిర్ముఖమైన మనస్సును ఆత్మవైపు మళ్ళించి హృదయ మందిరంలో బంధిస్తాయి.

సుషుమ్నానాడి పనిచేస్తున్నప్పుడు, రెండు నాసికా రంధ్రాల ద్వారా శ్వాస ఆడుతున్నప్పుడు ధ్యానం చేయడం సులభం, ఆనందకరం. మనస్సు శాంతంగా వుంటుంది. సుషుమ్న సక్రియంగా ఉన్నప్పుడు సత్వగుణం అభివృద్ధి చెందుతుంది. సుషుమ్న జాగృతం కాగానే ధ్యానానికి ఉపక్రమించండి.

ఏ జీవరాశికి కూడా అత్యాశ, స్వార్థం, కోపంవల్ల ఎలాంటి బాధ, హాని కలిగించకూడదు. క్రోధాన్ని త్యజించండి. పోట్లాడే తత్వాన్ని, అనవసర తర్కాలను పాల్పడే అలవాటు మానుకోండి. మీరు ఎవరితోనైనా పోట్లాడినా, తీవ్రమైన వాగ్యుద్ధానికి పాల్పడ్డా మూడు, నాలుగు రోజుల వరకు ధ్యానం చేయలేరు. మీ మనో సంతులిత అస్తవ్యస్తమవుతుంది. అనవసరమైన

**ఏ మంచిని, నమ్మకాన్ని ఎదుటి వారి నుండి నువ్వు ఆశిస్తున్నావో, ...**

విషయాలవల్ల ఎంతో శక్తి వృధా అవుతుంది. అన్ని కలతలకు, కలహాలకు దూరంగా వున్నప్పుడే మీరు ధ్యానం చేయగలరు. ప్రతికూల, నకారాత్మక ఆలోచనలను పారద్రోలండి. ఎల్లప్పుడూ అనుకూలంగా, సకారాత్మకంగా వుండండి. నిరంతరం మనస్సు ప్రశాంతంగా ఉండేలా నిర్విరామప్రయత్నం చేయాలి. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే ధ్యానం సాధ్యం. ప్రశాంతమైన మనస్సు అత్యంత విలువైన ఆధ్యాత్మిక సంపద.

ప్రతి సాధకుడు ప్రశాంతతను అలవర్చుకోవాలి. ప్రశాంతంగా వున్న మనస్సులోనికి దివ్య కాంతి ప్రసరిస్తుంది. వాసనలను, కోరికలను, తృష్ణలను నిర్మూలన చేసినప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. సాధకుడు నిర్భయుడై ఉండాలి. ఇది అత్యంత అవసరమైన లక్షణం. పిరికి, భయస్థుడైన సాధకుడు ఆత్మ సాక్షాత్కారానికి ఆమడ దూరంలో ఉంటాడు.

తీక్షణమైన, కఠినమైన యోగసాధనచేయడానికి, అపారమైన శారీరక, మానసిక, నాడీమండల శక్తి వుండాలి. సాధకుడు తన వీర్యశక్తిని కాపాడుకుంటే అపారమైన నాడీశక్తి కలుగుతుంది. వీర్యం నాడీ మండలానికి, మెదడుకు శక్తినిస్తుంది. ఎవరు బ్రహ్మచర్యాన్ని నిష్ఠగా పాటిస్తూ, వీర్యశక్తిని పవిత్రమైన ఓజః శక్తిగా మారుస్తారో వారే చాలా కాలం వరకు ధ్యాన సాదన చేయగలరు. అతడు మాత్రమే యోగా అనే సోపాన్ని ఎక్కగలడు. బ్రహ్మచర్య పాలనలేనిదే ఈషణామాత్రం ఆధ్యాత్మిక ప్రగతి సాధ్యంకాదు. బ్రహ్మచర్యం అన్న ఆధారంపైన మాత్రమే ధ్యానం, సమాధి అనే మందిరాన్ని నిర్మించగలం.

దృఢమైన వైరాగ్యం, రగిలేముముక్షత్వం, బలమైన వివేకం కలిగి ఉండాలి. ముఖ్యంగా మీకు మార్గనిర్దేశం చేయడానికి అనుభవజ్ఞుడైన గురువు వుండాలి. ✶

**మనస్సునూ, వాక్కునూ ఒకటిగా చేసి ప్రార్థిస్తే భగవంతుడు మన ప్రార్థనలను సఫలం చేస్తాడు. నోటితో ప్రభూ ! సకలము నీవే అంటూ చేసే ప్రార్థనలు నిరర్థకాలు.**

**- శ్రీ రామకృష్ణులు**

**... అవి ముందుగా నీ నుండే ఆరంభం కావాలి**

సందేశ భారతి

# దయానంద సరస్వతి

- సిలువేరు సుదర్శన్

"ధీయతే ధారయతే ఇతి ధర్మః". ధర్మము అంటే ఎల్లరు విధిగా పాటించవలసినది అని అర్థము. భారతదేశంలో ఎందరో మహానుభావులు పుట్టి శతాబ్దాల తరబడి ఈ ధర్మ సందేశాన్ని ప్రబోధిస్తున్నారు. ధర్మ ప్రబోధమే జీవన లక్ష్యమైన జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులు అవతరించిన తరువాత రెండువేల సంవత్సరాలకు మరో మహాభానువుడు స్వామి దయానంద సరస్వతి జన్మించారు. ఆయన భారతదేశంలో ధర్మస్థాపనకు ఎంతో కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి, ఆర్య సమాజ స్థాపకులు, స్ఫురద్రూపులు, భగవంతుడు పంపిన గొప్ప యోధులు.

దయానందులు మానవులను, సంస్థలను తీర్చి దిద్దిన మహాశిల్పి, తన మాతృభూమిని ధర్మసందేశాన్ని చాటిచెప్పే మహోన్నత దేశంగా నిర్మించారు. తాను నమ్మిన లక్ష్యాలకోసం అవిశ్రాంత పోరాటం సాగించారు. కొందరు దుష్టులు స్వామీజీని అనేక సార్లు విషం పెట్టి చంపాలని చూశారు. ప్రగతిని, సంస్కరణలను వ్యతిరేకించే మరి కొందరు కత్తులతో, లాఠీలతో, రాళ్ళతో హింసించారు. విషనాగును వేశారు, అవహేళన చేశారు. అయినా మొక్కవోని ధైర్యంతో తాను నమ్మిన ధర్మ పథంలో పురోగమించారు.

స్వామీజీ అసాధారణ శక్తి సంపన్నులు, ఆగ్రా నుండి మధుర వరకు 39 మైళ్ళ దూరాన్ని మూడు గంటలలో నడువగల సమర్థులు. ఆయనకు రెండు గుర్రాల బండిని అవలీలగా ఆపగలశక్తి సామర్థ్యాలు ఉన్నాయి. మల్లయోధులు ఆయనతో పోరాడి పరాజయం పాలయ్యారు. అడవులలో పులులు, ఎలుగుబంట్లవంటి క్రూర మృగాలకు ఎదురొడ్డి నిలిచి పారద్రోలారు.

ఒకరోజు గంగానది ఒడ్డున స్వామీజీ ధ్యానముద్రలో కూర్చొని ఉండగా ఇద్దరు దుండగులు దొంగ చాటుగా వచ్చి ఆయనను నదిలో పడవేయాలనే దురుద్దేశంతో ఎత్తి పట్టుకోగా స్వామీజీ ధ్యానావస్థ నుండి చేతనులై ఆ దుండగుల దశ్చర్యను గమనించారు. ఆ దుండగులను తన భుజాల క్రింద అదిమిపట్టి నదీ ప్రవాహంలోకి దూకారు. కాని నీటితో

స్వర్గాన్ని నరకం చేసేది, నరకాన్ని స్వర్గం చేసేది మన ఆలోచనలే

ఊపిరాడక చనిపోతారని దయతలచి వారిని వదలిపెట్టారు. వారు ఈదుకొంటూ ఒడ్డుకు చేరిపోయారు.

ఇంగ్లాండు తత్త్వవేత్త హేమిల్టన్ మహాశయుడు ఇలా అన్నారు. "ఈ ప్రపంచంలో మానవజన్మకంటే ఉత్కృష్టమైంది మరేదీలేదు. మానవుడిలో బుద్ధి అనే గొప్ప లక్షణం వుంది. భారతీయులతో మానవుడు గర్వించగలిగిన ఉన్నత బుద్ధి భావనలు ఉన్నాయి". ప్రాపంచిక విషయాలతో సతమతం అయ్యే ఇంద్రియాలకు, దివ్యమై ఆత్మకు మధ్యస్థమైనది బుద్ధి.

ఆనాడు మూఢ నమ్మకాలు, అజ్ఞానం బ్రిటీషు పాలకుల నియంతృత్వం, ప్రజల దుర్భర దారిద్ర్యం, ఐకమత్య రాహిత్యం, మనోబలం లేకపోవడం వంటి దయనీయ పరిస్థితులు దయానందుని మనస్సును కలవరపచాయి. ఇందుకు దయానందుడు ఎంతో ప్రతిస్పందించారు. ఇలా ఆలోచించారు. ఈ ప్రపంచము అజ్ఞానం, మూఢ నమ్మకాల శృంఖలాలతో కట్టబడి ఉన్నది. ఈ శృంఖాలాలను ఛేదించడానికి నేడు అవిరామంగా కృషి సల్పాలి. నా ఒక్కని ముక్తిని గురించే కాదు, బలహీనులు, నిరుపేదలు, కష్టాలలో మగుతున్న లక్షలాది ప్రజల విముక్తి కోసం నేను ప్రయత్నించాలి. ఈ లక్ష్యసాధనలో నేను దేనికి వెనుకాడను. అసహాయ ప్రజలకు విముక్తి సిద్ధించినపుడే నాకు విముక్తి". స్వామి దయానందులు ఆ సంకల్పానికే జీవితం అంకితం చేసిన నిస్వార్థ కార్యశీలి. ఆయన వేదాలను ఉద్ధరించి వాటిని నిజమైన అర్థాలు చెప్పారు. ప్రతి మనిషి వేదాలను చదవడానికి, వినడానికి అర్హుడని ప్రోత్సహించారు. మనుషులను మోక్షానికి దూరం చేసే విగ్రహారాదన లాంటి ఎన్నో దురాచారాలను రూపుమాపడానికి అహర్నిశలు పోరాడారు.

స్వామి దయానంద సరస్వతి సామాజిక అసమానతలను తొలగించుటకొరకు, ప్రజలను బానిసత్వము నుండి విముక్తులను చేయుట కొరకు ఎంతో కృషి చేశారు. పాశ్చాత్య సామాజిక వేత్త కార్ల్‌మార్క్స్, దయానందులు సమకాలీనులు, 1824 ఫిబ్రవరి 12వ తేదీన జన్మించారు. అంటే కార్ల్‌మార్క్స్ ప్రభవించిన ఆరు సంవత్సరాల తర్వాత స్వామీజీ జన్మించారు. మార్క్స్ మహాశయుడు 1883 అక్టోబర్ 30వ తేదీన స్వామి దయానందులు స్వర్గస్థులైనారు. ఇద్దరూ నిస్వార్థపరులైన ఆదర్శపురుషులే.

కార్ల్‌మార్క్స్, ఏంజిల్స్ రచించిన కమ్యూనిస్టు మానిఫెస్టో 1948లో ఆనాటి సామాజిక పరిస్థితులకు దర్పణం పట్టింది. "ప్రపంచదేశాల్లోని కార్మికులారా ఏకం కండి" అని ఉద్ఘాటించింది. కాగా స్వామి దయానందుడు రచించిన సత్యార్థ ప్రకాశము 1870వ దశాబ్దంలో

**మనం గెలవకపోయినా ఫర్వాలేదు, కనీసం గెలిచి వాడి ప్రతిభను గుర్తిస్తే చాలు**

ప్రచురితమైనంది. "కృణ్వంతో విశ్వమార్యం" అనేది స్వామీజీ నినాదం. ఇది ఈ ప్రపంచాన్ని ఆదర్శవంతులు, ఔదార్యవంతులకు నిలయంగా తీర్చిదిద్దింది. వీరిద్దరి దృక్పథాలు విశ్వజనీనమైనవి.

వర్గరహిత సమాజ నిర్మాణానికి సాగించిన పోరాటంలలో కార్ల్‌మార్క్స్ అతని అనుచరులు శ్రామిక ఆధిపత్యం కోసం ఎంతగానో శ్రమించారు. అయితే వారూహించిన ఆదర్శ వ్యవస్థ సాధించలేకపోయారు. ఈనాడు రష్యా ముక్కలు, చెక్కలై, కమ్యూనిజం సమాధి అయింది.

స్వామి దయానంద ఉత్తమ సమాజ వ్యవస్థ స్థాపనకోసం ఇలా కలలుకన్నారు. ఆ సమాజ వ్యవస్థ ప్రతిభ, యోగ్యతల ఆధారంగా ప్రభుత్వం ప్రజల విద్యుక్తధర్మాలను నిర్ణయించేదిగా ఉండాలి. కుల, మత వర్గ ప్రసక్తికి తావుండరాదు. దోపిడి స్థానములో త్యాగబుద్ధి విలసిల్లాలి. వ్యక్తి స్వేచ్ఛకు పట్టం కట్టాలి. నైతిక విలువలకే గౌరవాదరణలు ఉండాలి. శ్రేయోదృక్పథం అలవర్చుకోవాలి.

స్వామీజీ ప్రజాసామ్యవాది. అజ్ఞానం, నిరక్షరాస్యతకు తావులేని నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని అభిప్రాయపడ్డారు. మతాధిపతుల వ్యవస్థను గట్టిగా నిరసించారు. కమ్యూనిస్టు మానిఫెస్టోను ప్రకటించిన ఏడు దశాబ్దాల తర్వాత కమ్యూనిజం అధికారంలోకి వచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన 7 దశాబ్దాల తర్వాత కుప్పకూలి పోయింది. స్వామి దయానంద ఆర్య సమాజ్‌ను స్థాపించిన 142 సంవత్సరాల తర్వాత కూడ ఆయన తలపెట్టిన సామాజిక వ్యవస్థ అనుసరణీయంగానే ఉంది. ఆర్య సమాజ్ రాజకీయంగా ఎటువంటి లబ్ధి పొందలేదు. అయితే ఆర్య సమాజ్ సిద్ధాంతాలు మాత్రం ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందాయి.

ఆర్య సమాజ్ రాజకీయ అధికారాలకోసం ప్రాకులాడలేదు. స్వాతంత్ర్య పోరాటంలో ఆర్య సమాజీయులు చేసిన త్యాగాలు ప్రశంసనీయమైనవి. వాస్తవం ఏమిటంటే బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా ఆర్యసమాజ్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని దృఢతరం చేసింది. మనకు స్వాతంత్ర్యం సిద్ధించటానికి ఆర్య సమాజీయుల త్యాగాలు కూడా కారణమే. ఆర్యసమాజ్ రాజకీయ అధికారాలకు దూరంగా ఉండి మాతృభూమి సంరక్షణకోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించింది.

**జీవితమంటే ఒక సమస్య నుండి మరో సమస్యకు ప్రయాణం మాత్రమే. ...**

కార్ల్‌మార్క్స్‌లాగా కాకుండా స్వామి దయానందులు భగవంతునియందు నమ్మకము గలవారు. ఆయన తుదిశ్వాస వదిలేటప్పుడు కూడా భగవన్నామ స్మరణం మరువలేదు, భగవంతుని స్తుతిస్తూనే కన్ను మూశారు. మన ప్రాచీన ఋషులు, సంభాషించినట్లు భగవంతుడే ప్రేరకుడని, మానవులంఖ నిమిత్త మాత్రులని, ఈ చరాచర సృష్టి పరమాత్మ రచన అని స్వామీజీ ప్రకటించారు.

వ్యాధులను నయం చేయడానికి, మనసును అదుపులో ఉంచుకోవడానికి యోగాభ్యాసం అవసరమని యోగిపుంగవులైన స్వామీజీ అభిప్రాయపడ్డారు.

వైదిక ధర్మమే పరమోత్కృష్టమైన ధర్మమని ఆయన అభిప్రాయం, ధర్మపథంలో నడుస్తూ, మానవతా విలువలతో ధర్మ సందేశాన్ని చాటాలనే అభిప్రాయంతో ఆయన వైదిక ధర్మాన్ని పునరుద్ధరించారు. ఆయన ఏ మతాన్ని కాని, మత ప్రవక్తను కాని కించపరచలేదు. భగవంతుని పట్ల విశ్వాసం, ఆరాధనకు సంబంధించి ఏకాభిప్రాయాన్ని సాధించడం కోసం ప్రపంచంలోని అన్ని ప్రధాన మతాల ప్రతినిధులతో ఒక సదస్సును ఆయన ఏర్పాటు చేయడంకోసం ఆయన చేసిన ప్రయత్నాలు మరువలేనివి. ✶

**ధనం పరులపాలు - కుటుంబ సభ్యులు, బంధువ్యులు, స్నేహితులు స్మశానం వరకు - శరీరం చితిపైకి - కర్మ ఫలం మాత్రమే వెంటవస్తుంది.**

✶✶✶

**మంచి పనులు చేసేవారిని 'మహనీయులు' అంటారు. సమాజ సేవకు జీవితాన్ని సమర్పించినవారిని 'మహాత్ములు' అంటారు.**

✶✶✶

**పని చేయకుండా ఖాళీగా ఉండటం బాగుండవచ్చు. కాని దాని ఫల స్వరూపం బాగుండదు**

కాబట్టి సమస్యలు లేని జీవితం ఉండదు

# ప్రస్థాన త్రయము

కూర్పు : ఆకుల రామయ్య

దిగువ పేర్కొనిన పవిత్రమైన ధర్మశాస్త్రాలను ప్రస్థానత్రయము అంటారు. 1) ఉపనిషత్తులు (శ్రుతి ప్రస్థానము) 2) శ్రీమద్భగవద్గీత (స్మృతి ప్రస్థానము) 3) బ్రహ్మసూత్రములు (న్యాయ ప్రస్థానము).

అనంత జ్ఞానమును కలిగిన వేదాలు ఏ పురుషుడు వ్రాసినవికావు. కనుక అవి అపౌరుషేయాలు. వేదాలు నాలుగు. ఋగ్వేదము, సామవేదము, యజుర్వేదము, అధర్వణవేదము. ప్రతి వేదమునకు నాలుగు భాగాలు. సంహితలు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు (వేదాంతము). సంహిత భాగము వృక్షమైతే, బ్రాహ్మణ భాగము పుష్పమని, ఆరణ్యము కాయ అని, ఉపనిషత్తులు పక్వమైన ఫలమని పెద్దల నిర్ణయము. సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యకాలు కర్మకాండకు సంబంధించినవి. ఉపనిషత్తులు జ్ఞానకాండకు సంబంధించినవి. కర్మకాండను ప్రధానంగా తీసుకొని, వ్యాసుని శిష్యుడై జైమిని మహర్షి పూర్వమీమాంసను రచిస్తే, జ్ఞానకాండను ప్రధానంగా తీసుకొని వ్యాసుడు ఉత్తరమీమాంస (బ్రహ్మసూత్రములు) రచించాడు.

## ఉపనిషత్తులు

వేదార్థములను తెలియజేయుటకు ఉపనిషత్తులు ప్రమాణమగుచున్నవి. వేదాల చివరిభాగములో ఉన్న కారణంగా ఉపనిషత్తులను వేదాంతము అన్నారు. ఉపనిషత్తులు లెక్కకుమించి ఉన్నాయి. వీటిలో పదింటిని, శ్రీ ఆదిశంకరాచార్యస్వామి ఎంపికచేసి వాటిపై సాంప్రదాయ వ్యాఖ్యానము అందించారు. అవియే దశోపనిషత్తులు. దశోపనిషత్తుల వివరాలు 1) ఈశావాస్యోపనిషత్తు 2) కేనోపనిషత్తు 3) కఠోపనిషత్తు 4) ప్రశ్నోపనిషత్తు 5) ముండకోపనిషత్తు 6) మాండుక్యోపనిషత్తు 7) తైత్తరీయోపనిషత్తు 8) ఐతరేయోపనిషత్తు 9) ఛాందోగ్యోపనిషత్తు 10) బృహదారణ్యకోపనిషత్తు. ఈ పది ఉపనిషత్తులపై శ్రీ శంకరాచార్యులు భాష్యము అందించారు. ఇది అద్వైతపరంగా ఉంటుంది. కొన్ని శతాబ్దాల తరువాత అరదెంచిన రామానుజ, మధ్వాచార్యులు మొదలైనవారు వీటి మీదనే భాష్యములు అందించారు. వారు

**చేయకుండా చేశామనేవాడు అధముడు ; కొద్దిగా చేసి కొండంత చేసానని ...**

తమ సిద్ధాంతరీత్యా అద్వైతానికి భిన్నంగా రచించారు. ఈ కారణాన్ని దృష్టిలో పెట్టుకొని,శంకర భాష్యాన్ని అద్వైత భాష్యంగా చెప్పవలసి వచ్చింది. లేకపోతే "అద్వైత'' మని ప్రత్యేకించి చెప్పవలసిన అవసరంలేదు. ఉపనిషత్ అంటే బ్రహ్మవిద్య అని అర్థం. ఉపనిషత్తులు బోధించేది అద్వైత జ్ఞానాన్ని మాత్రమే. రోగార్తునికి రోగం నయంకాగానే స్వస్థత కలిగినట్లుగా, దుఃఖితుడైన వానికి ద్వైత ప్రపంచం ఉపశమిస్తే స్వస్థత కలుగుతుంది. ఇదే అద్వైత భావం యొక్క ముఖ్యఫలము.

## భగవద్గీత

ఉపనిషత్తులలోని గంభీరార్థమును విశదముగా వివరించునది భగవద్గీత. మార్పే మరణం. ఇది అనివార్యమైన తీర్పు. ఇలాంటి మృతజీవనం నుండి విడిపడటమే మోక్షము. ఎంతకాలం జీవించినా, ఈ ప్రపంచం నుండి నిరాశతో తిరిగి పోవలసిందేనా ? ఇది ఒకరికి సంబంధించిన సమస్యకాదు. అన్ని కాలాలకు, అందరు వ్యక్తులకు, అన్ని దేశాలకు సంబంధించిన ఈ సమస్య, ఐదువేల సంవత్సరాల క్రితం, కురుక్షేత్ర రణరంగంలో అర్జునుని కుదిపివేసింది. ఉభయ సేనలను చూచి కలతచెందాడు. కన్నీరు కార్చాడు. యుద్ధంలో అనివార్యంగా తనవారందరు చనిపోతారని దుఃఖంతో, యుద్ధంలో విజయం సిద్ధిస్తుందో లేదోనని శంకతో, సామూహిక మరణాల వలన సమాజం అస్థిరతకు గురి అవుతుందేమోనని ఊహలతో కలత చెందాడు అర్జునుడు.

దేహాలు నిలిచేవికావు, బాంధవ్యాలు కొనసాగేవికావు, రాజ్యసుఖాలు కూడా క్షణికమేనని తెలియజేయటానికే, అర్జునుని నిమిత్తమాత్రునిగా చేసుకొని, మనందరిచేత గీతామృతాన్ని త్రాగించాలని, శ్రీకృష్ణపరమాత్మ సంకల్పించాడు. తెలిసీ తెలియక, అందరూ అన్వేషిస్తూ సచ్చిదానంద స్థితిని ఎరుకపరిచేందుకు సిద్ధమయ్యాడు శ్రీకృష్ణుడు. సచ్చిదానంద మోక్షస్థితినే అందరూ అన్వేషిస్తున్నారు. కాకపోతే, అది ఉన్నచోట్ల కాకుండా లేనిచోట వెదుకుచున్నారు. నీవు ఆశించే, అన్వేషించే సచ్చిదానందము నీవే. నీవు భావిస్తున్నట్లు, నీవు పరిమితుడవే అయితే ఇక పూర్ణుడవు ఎప్పుడూ కాలేవు. అనంతమనేది మరొక దానిచేత సృష్టించబడేది కాదు. అది ఎప్పుడూ ఉన్నదే. అదే నీవు. అదే నేను. ఇరువురమూ అనంతమే. సచ్చిదానందం నేనే అయినపుడు, దానిని నేను ఎందుకు పొందలేకున్నాను? ఉన్న దానిని పొందాలని ఎందుకు ఆశిస్తున్నాను? ఎందుకనగా, ఉన్నది ఉండి, అలా ఉన్నట్లు తెలియనపుడు అలా ఆశిస్తారు. ఇలా ఉంటూ, తెలియక పోవడమే అజ్ఞానము. అట్టి అజ్ఞానమును తొలగించే విద్యను పొందడమువలన, నన్ను అను గ్రహించుటకు అవరోధంగా నిలిచిన అజ్ఞానం తొలగి పోతుంది. మోక్షము స్వతస్సిద్ధమై భాసిస్తుంది.

**... చెప్పేవాడు గర్విష్ఠి. ఎంతో చేసే, ఏమీ చేయలేదని చెప్పేవాడు సజ్జనుడు**

జ్ఞానం వలననే మోక్షము ప్రాపిస్తుంది. గీత, ఉపనిషత్తుల సారమిదే. బ్రహ్మము లేదా ఆత్మ లేదా సచ్చిదానందము అజ్ఞాతమని అర్థమైంది. అజ్ఞాతమైన దానిని తెలుసుకొనుటకు జ్ఞానమే ప్రధానము. అదియే ప్రమాణము. ఆత్మ అనేది, దృశ్యవస్తువులాంటిది కాదు. కనుక, ప్రత్యక్షప్రమాణాల ద్వారా పొందబడదు. దానిని సంబంధించిన జ్ఞానము, ప్రమాణము ద్వారానే తెలియాలి. అట్టి ప్రమాణమైన శాస్త్రము వేదమే. గీత కూడా ప్రమాణమైన శాస్త్రమే. గీత ఉపనిషత్తుల సారము. అది మోక్ష శాస్త్రము. అందుకే, భగవద్గీత సర్వశాస్త్ర స్వరూపిణియని స్తుతించడం జరిగింది. గీత సాక్షాత్తు విష్ణుదేవుని ముఖకమలము నుండి పుట్టింది. ఆత్మ జ్ఞానమునకు వేదమే ప్రమాణమైనను, భగవద్గీతయందు ఉన్నదంతయు వేదసారమే, ఉపనిషత్సారమే, కనుక, భగవద్గీత కూడా ఆత్మజ్ఞానమును పొందుటకు ప్రమాణమై శోభిస్తుంది.

శ్రీకృష్ణపరమాత్మ జ్ఞానబోధ విన్న తర్వాత, అర్జునుడు "కృష్ణా, నీదయవలన నామోహం నశించింది, స్మృతి జ్ఞానం కలిగింది, సంశయ రహితుడనయ్యాను. నీ ఆజ్ఞశిరసాహిస్తాను" అని చెప్పి, తన కర్తవ్య కార్యమగు ధర్మయుద్ధమునకు తలపడి విజయము సాధించాడు. ఈ విధంగా, అర్జునుని సమస్య పరిష్కరించి, నిశ్చి త ఫలమునిచ్చి, గీతాశాస్త్రము ప్రమాణమై శోభించింది.

## బ్రహ్మసూత్రములు

ఉపనిషత్తుల గమనమే బ్రహ్మసూత్రములు. అనంతమగు బ్రహ్మనుగూర్చి తెలుపుటకు వ్యాసభగవానుడు బ్రహ్మసూత్రములను రచించాడు. "అహమస్మి" నేను ఉన్నాను, అన్నప్పుడే ఆత్మ అస్తిత్వం. తెలుస్తుంది. ఇది సామాన్య జ్ఞానం నేను దేహమును, మనస్సును, కర్తను, భోక్తను అనుకోవడం విపరీతజ్ఞానం. సామాన్య జ్ఞానం ఉన్నను, విశేషజ్ఞానం లేనికారణంగా, విపరీతజ్ఞానం కలుగుతూ ఉంది. ఈ వివేషజ్ఞానమే స్వరూపజ్ఞానం. ప్రత్యక్షాది ప్రమాణాలకందక, కేవలం శాస్త్రప్రమాణం ద్వారా బోధపడేది స్వరూపజ్ఞానం. ఉపనిషత్తులలో స్వరూపజ్ఞానాన్ని ప్రసాదించే వాక్యాలు ఎన్నో ఉన్నాయి. కాని, వాటిని విపరీతంగా కాకుండా విశేషం అర్థం చేసుకునేందుకు విశ్లేషణ అవసరము. దీనినే **మీమాంస** అంటారు. బ్రహ్మసూత్రాలు మీమాంస శాస్త్రము.

బ్రహ్మ సూత్రములను ఉత్తర మీమాంస అంటారు. వ్యాసమహర్షి శిష్యుడైన జైమిని మహర్షి రచించిన ధర్మప్రధానమైన శాస్త్రము పూర్వమీమాంస అయినందున, వ్యాసుడు రచించిన జ్ఞానప్రధానమైన బ్రహ్మసూత్రములను ఉత్తరమీమాంస అన్నారు.

**మనలో ఉన్న చెడు ఆలోచనలను తొలిగిస్తే మంచి ఆలోచనలు వస్తాయి**

వేదము ధర్మాన్ని రెండు విధాలుగా ప్రతిపాదించింది. ఒకటి ప్రవృత్తి. మరొకటి నివృత్తి. ప్రవృత్తి కర్మమార్గము. నివృత్తి జ్ఞానమార్గము. పూర్వభాగం కర్మకాండ కాగా, ఉత్తర భాగం జ్ఞానకాండగా ప్రసిద్ధి. పూర్వభాగం, విధి ఉపాసనల ద్వారా, జ్ఞానానికి సిద్ధంచేసి ప్రవృత్తి లక్షణ ధర్మం. ఉత్తరభాగం, జ్ఞానమును ప్రసాదించి స్వరూప స్థితిలో నిలిపే నివృత్తి లక్షణ ధర్మం.

## సూత్ర వైభవము

**"అల్పాక్షర మసందిగ్ధం సారవద్విశ్వతోముఖం**
**అస్తోభో మన వద్యంచ సూత్రం సూత్రం విదో విదుః" ॥**

1) అల్పాక్షరమై – సూత్రంలోని అక్షర సంఖ్య అల్పంగా ఉండాలి. సంక్షిప్తంగా ఉండాలి.

2) సంశయ రమితమై – సందేహాలకు సూత్రంలో స్థానం ఉండకూడదు.

3) సారభూతమై – అర్థవంతంగా ఉండాలి. సారంలేకుండా, అనర్థంగా ఉండగూడదు.

4) సర్వవ్యాప్తమై – బహుళ ప్రయోజనకారిగా ఉండాలి (విశ్వతోముఖమ్).

5) అనర్థపదరమితమై – నిశ్చితార్థాన్ని, పదం వివరించగలగాలి. సమన్వయ ప్రధానం (అస్తోభం).

6) నిర్దోషమై – సూత్రం దోషరహితంగా ఉండాలి. సమన్వయలోపం ఉండకూడదు.

బ్రహ్మసూత్రాలు సూత్ర బద్ధమై ఉన్నాయి. వ్యాఖ్యానం లేకుండా వాటిని అర్థం చేసుకోవడం సాధ్యంకాదు. అందుకే, అనేకమంది వ్యాఖ్యాతల అద్వైతపరంగా, భాష్యాన్ని అందించారు. బ్రహ్మసూత్రాలకు ఉపనిషత్తులే ఆధారము. ఉపనిషత్తులు అద్వితీయమైన ఆత్మ తత్వాన్నే ప్రతిపాదించాయి. అమోఘమైన, అద్భుతమైన, అసమానమైన బ్రహ్మసూత్రములను రచించిన వేదవ్యాసుడు, బ్రహ్మసూత్రములకు భాష్యమును రచించిన ఆదిశంకరులు భగవత్స్వరూపులు. ప్రాతఃస్మరణీయులు.

శంకర శంకరాచార్యం కేశవం బాదరాయనం
సూత్ర భాష్య కృతావందే భగవంతం పునః పునః ॥

బ్రహ్మసూత్రములకు రచించిన వ్యాసభగవానుడు సాక్షాత్తుకేశవుడే. నారాయణుడే. పరమశివుడు, ఆదిశంకరులుగా అవతరించి, వ్యాసుడు రచించిన, బ్రహ్మసూత్రములకు భాష్యాన్ని అందించారు. వ్యాసుడు, శంకరాచార్య – ఇద్దరూ ఒక్కరే కనుక "పునః పునః భగవంతం వందే" – మళ్లీ మళ్లీ అద్వయానంద పరమాత్మకు నమస్కరించుచున్నాను.

✶

ఓం తత్సత్ – లోకాస్సమస్తాఃసుఖినోభవంతు

**మనం చేసే పనిపట్ల మనకుగల విశ్వాసం, శ్రద్ధే మన గెలుపు ఓటములను నిర్ణయిస్తాయి**

పద్య భారతి

# నేతాజీ

- డా॥ వడ్లూరి ఆంజనేయరాజు

సీసమాలిక

ఘనవివేకానందముని నాత్మలో నిల్పి
దేశసేవకుఁజన్న ధీరుడెవడు
చిత్తరంజనుమాట శిరమున ధరియించి
దాస్యశృంఖలద్రెంప తరలెనెవడు
మాతృభూసేవకై మృత్యు కౌగిలినైన
ప్రియముతోఁగోరిన వీరుడెవడు
అసమాన ధైర్య సాహసముల నాంగ్లేయ
దొరల గర్వమ్మును ద్రుంచెనెవడు
పరతంత్రమునఁగ్రుగ్గు భారతావనికి స్వే
చ్ఛావాయు విచ్చిన శక్తి యెవడు

పరదేశప్రభువుల పాదాల త్రొక్కిల్ల
నలిగి పోయిన జాతి నిలిపె నెవడు
ఆజాదు హిందుఫౌజను పేరనొక సేన
నెలకొల్పి ప్రజల మేల్కొలిపెనెవడు
జైహిందు జైహిందు శబ్దమజాండమున్
నిండగా నినదించు నేత యెవడు

గీ॥ అతడు నేతాజి సుభాషుడమర జీవి
తల్లి భారతి గర్భముక్తాఫలమ్ము
దేశ భక్తుడు ధన్యుడు ధీయుతుండు
అట్టి జాతీయ వీరుని కంజలింతు ॥

✶

ప్రతి మనిషిలోనూ మంచి చెడువృంటాయి. సందర్భాన్ని బట్టి అవి బయటకు వస్తూంటాయి

భజన భారతి

# గురు పౌర్ణమి - ఆషాఢమాసం

- వేల్పుల పెద్దిరాజయ్య

**గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణు గురుదేవో మహేశ్వరా**
**గుర్ సాక్షాత్ పరబ్రహ్మ తస్మహి గురవే నమః "** ॥గురు॥

1) అమ్మయే అందరికి ఆది గురువు
నాన్న యే అందరికి జ్ఞాన గురువు
విద్య నేర్పిన గురు విద్యా గురువు
అధ్యాత్మిక మందించిన అతడే సద్ గురువు ॥గురు॥

2) అందరికి గురువుంటాడు అజ్ఞానం బాపుటకు
సద్ గురువుని నమ్ముకుంటే జన్మం కడతేరును
దేవతలకు ఉన్నాడు బృహస్పతి గురువు
రాక్షసులకు ఉన్నాడు శుక్రాచార్యుడు ॥గురు॥

3) ఆంజనేయుని గురు ఆదిత్య సూర్యుడు
పర్షరాముని గురు పరమేశ్వరుడు
శ్రీరామునికున్నాడు వాశిష్ట గురవు
శ్రీకృష్ణునికున్నాడు సాందీప గురుడు ॥గురు॥

4) అద్వైత మతగురు ఆదిశంకరుడు
విశిష్ట అద్వైత గురురామానుజుడు
ద్వైత్య మతగురు మధ్వాచార్యుడు
ఆషాడ పౌర్ణమి గురు వ్యాసా భగవానుడు ॥గురు॥

✶

**వైఫల్యం నిరాశకు కారణం కాకూడదు. క్రొత్త ప్రేరణకు నాంది కావాలి**

భాగవత భారతి

# నారాయణీయ సంక్షిప్త వివరణము

*(గత సంచిక తరువాయి)* **- శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం**

**11) సనకాదులకు దర్శనము –** ఈ విధముగా చరాచరసృష్టి, సాగిపోవుచుండగా, ఒకనాడు బ్రహ్మ మానసపుత్రులైన సనకసనందనారి, బ్రహ్మర్షులు, భగవద్దర్శనమునకుగాను, వైకుంఠమనకు వెళ్ళగా, అచ్చటి ద్వారపాలకులైన జయవిజయులను వారు అడ్డగించగా, ఆ బ్రహ్మర్షులు, రాక్షసులుగా జన్మించమని శపించిరి. ఆ శాప ఫలితముగా వారిరువురు కశ్యప ప్రజాపతికి హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులుగా జన్మించిరి. హిరన్యాక్షుడు ఈ సర్వం సహాయైన భూమాని బంతిలాగాచేసి, సముద్రగర్భమున దాచెను. తరువాత శ్రీహరియైన భగవంతుని అన్వేషించుతూ ఈ ప్రపంచమంతయు తిరిగెను.

**12) వరాహావతారము –** అప్పుడు సముద్రగర్భములో దాచబడిన భూమి లేనందువలన సృష్టికార్యమంతయు స్తంభించగా భగవంతుడు బ్రహ్మను, ఓదార్చి, మహావరాహ రూపమును పోల్చి క్రోధాగ్నితో ఆ మహాప్రళయ సాగరములో మునిగి భూదేవిని వెదకి ఆమెను తన కోఱ పళ్ళతో పైకి తెచ్చెను.

**13) హిరణ్యాక్ష వధము –** ఈ విషయమెఱింగిన హిరణ్యాక్షుడు వరాహరూపుడైన భగవంతునితో భయంకరముగా పోరాడి ద్వంద్వయుద్ధము చేసెను. ముష్టిష్ట ప్రహారములు చేసెను. అప్పుడు ఆ భగవంతుడు తన చక్రాయుధముతో అతని కరములను శిరస్సును ఖండించెను. అది మొదలుకొని దేవతలు మునులు భగవంతుని యజ్ఞ వరాహమూర్తిగా పూజించిరి. ఎలాగనగా భగవంతుని శరీర చర్మమేగా యత్రి మొదలగు ఛందస్సులు రోమములు దర్భలు, నేత్రములు నెఋన, అధ్వర్యుడు ఉద్గాతా హొూత, బ్రహ్మ అను ఈ నలుగురు ఆయన నాలుగు పాదములు. ముక్కు "స్రుక్కు" అనే హోమ సాధనము, ఉదరము "ఇడ" అను పురోడాశాది హోమద్రవ్యములనుంచెడిపాత్ర భగవంతుని జిహ్వయే గ్రహము అనగానే మరసముంచెడి పాత్ర. కర్ణములే చమసముల అనగా కఱ్ఱతో చేసిన పాత్రము, భగవంతుని వీర్యమే సోమరసము, భగవంతుని గళము ఉపపదమనే యాగవిశేషము. ఈ విధముగా ఆ యజ్ఞ వరాహమూర్తిని యజ్ఞ స్వరూపుడుగా భావించిరి.

ఎంత అరగదీసినా గంధపు చెక్క పరిమళాన్ని కోల్పోదు. ...

**14) కపిలావతారము –** బ్రహ్మదేవుని శరీరోద్భవుడైన మనువు నిరంతరము, శ్రీ హరిపాదములనే ధ్యానము చేయుచూ తన యొక్క మన్వంతరములో సుఖముగా కాలము గడుపుచుండగా అదే సమయంలో బ్రహ్మ శరీర చాయనుండి జన్మించిన కర్దమప్రజాపతి, సృష్టివృద్ధికొఱకు భగవంతుడైన నారాయణుని ప్రార్థించగా శ్రీహరి ప్రత్యక్షమై మనుపత్రికయైన దేవహూతిని వివాహమాడిన తానే వారిరువురికి కపిలుడనే పుత్రుడుగా జన్మించెదనని వరములిచ్చి తానొసంగిన వరము ప్రకారము కపిలావతారుడుగా జన్మించెను.

**15) కపిలగీత లేక కపిలోపదేశము –** ఒక తల్లికి కుమారుడై జన్మించే జీవుడు స్త్రీ గర్భమును ప్రవేశించినప్పటి నుండి గర్భక్లేశములనుభవించుచు, తాను జన్మించుటకు పూర్వము పరామాత్మ కరుణవలన జ్ఞానవంతుడైనను భాస్పర్శ కలిగిన వెంటనే (పుట్టగనే) ఆ జ్ఞానమంతరించగా ఆ జీవుని యొక్క బాల్యము అనేక బాధలతోను యౌవనము మోహముచేతను కోల్పోవును. అనగా జీవితమంతయు మాయామయము ; జ్ఞానవంతులైన యోగులు కూడ ఈ ప్రపంచమాయలో బంధింపబడి అంతములో అనుభవపూర్వకముగా తెలుసుకొని బంధవిముక్తులగుదురు. ఈ విధముగా బందరహితులు కావలెనన్న భగవంతుని పాదారవిందములనే శరణుపొందవలెనని కపిలావతారుడైన శ్రీహరి తల్లియైన దేవహూతికి సాంఖ్యయోగమును బోధించెను.

**16) నరనారాయణుల అవతారము –** ధర్ముడనే పుణ్యపురుషుడు మనువు యొక్క పుత్రియైన "మూర్తి" యను కన్యను వివాహమాడగా వారిరువురికి మహా మహిమాన్వితుడైన భగవంతుడు కర్మపరిహారము కొఱకై "నారాయణు" డై అవతరించగా ఆ నారాయణుని అంశయే. "నరుడు" ను పేరిట జన్మించెను. వారిరువురు అన్యోన్యముగా వృద్ధిపొందుచూ "సహస్రకవచు" డనే రాక్షసుని హతమార్చిరి. వారి యొక్క తపమును భంగమొనరించుటకై దేవేంద్రుడు దివ్యాంగనలను పంపగా వారు భంగముచేయలేకపోయిరి. అప్పుడు వారిరువురు సర్వాప్సరల కంటే సౌందర్యవతియైన "ఊర్వసి"ని సృష్టించి ఇంద్రునకు బహుమతిగా పంపెను. ఇదే విధముగా బ్రహ్మమానస పుత్రుడైన దక్షుడు నిరీశ్వరయాగము చేయుచుండగా కృద్ధుడైన శంకరుడు అతని శిరమును ఖండించెను. అప్పుడు దేవతలందరు శంకరుని ప్రార్థించగా ఆయన దక్షుని రక్షించి యజ్ఞమును సుఖపూర్వకముగా సంపూర్ణముగావించెను.

**17) ధ్రువ చరిత్రము –** మనుపుత్రుడైన, ఉత్తాన పాదుడనో రాజుకు సునీతి సురుచియను, ఇరువురి పత్నుల మూలముగా, ధ్రువుడు, ఉత్తముడనే, ఇరువురు పుత్రులు కలిగిరి. రాజు,

**... ఎన్ని కష్టాలెదురైనా ధీరుడు ఆత్మవిశ్వాసం కోల్పోడు**

చిన్న భార్యయందే, అధిక మోహము కలవాడై పెద్ద భార్యమయిన, సునీతిని, నిరాదరింపసాగెను. ఒకనాడు, పంచవర్షప్రాయుడైన ధ్రువుడు, తండ్రి ఒడిలో కూర్చుండవలెనని, తండ్రి వద్దకు రాగా సురుచి, ధ్రువుని వారించి, తండ్రి ఒడిలో కూర్చుండుటకు అతనికి అర్హతలేదని అధిక్షేపించగా దానవలన అధిక వ్యాకులతను చెందిన ధ్రువుడు తపస్సు చేయుటకు, నిశ్చయించగా అప్పుడచ్చటికి విచ్చేసిన, నారదమహర్షుల ఉపదేశమును పొంది మధువనములో ఘోరమైన తపమాచరించుచుండగా భగవంతుడు గరుడవాహనారూఢుడై ప్రత్యక్షమై వరములను ఆశిస్సులనొసంగగా సహస్ర వర్షములు రాజ్యభోగములనుభించుతూ, రాజ్యపాలనముచేసి శాశ్వతమైన ధ్రువపదమును పొంది ఇప్పటికినీ ధ్రువనక్షత్రముగా తారాపథమున వెలుగుచున్నాడు.

**18) పృథుచరిత్రము –** ధ్రువుని వంశములో జన్మించిన అంగుని కుమారుడడగు ధ్రువుని వంశములో అనేకవిధములుగా భాధించి మునుల శాపమువలన మరణించగా రాజులేని రాజ్యము నశించునని ఋషులు మొదలగు తీర్మానించి వేనుని ఊరువులను (తొడలను) మథించగా అతని పాపమంతయు నశించగా ఆ మథనమువలన ఆ భగవంతుడు పుణ్యపురుషుడు పృథువుగా జన్మించెను. కామక్రోధాదులతో కూడిన వేనుడు పాలించిన, ఆ రాజ్యమును కామధేనువువలే మార్చి యాగాడు లొనరించి, సస్యశ్యామలముచేయగా, అప్పుడు ఇంద్రాదిదేవతలు యాగధ్వంసము చేయవెంచి యాగాశ్వమును దొంగిలించగా పృథుకుమారుడ ఇంద్రుని ఓడించి ఆ యాగాశ్వమును తీసుకొని వచ్చి **"విజితాశ్వుడు"** అను పేరుగాంచెను. కాని మరల ఇంద్రుడు ఆ యాగాశ్వమును దొంగిలించుటకు ప్రయత్నించగా ఋత్విక్కులు దేవేంద్రుని ఆహుతి యిచ్చుటకు ప్రయత్నించగా అప్పుడు బ్రహ్మదేవుడు స్వయముగా ప్రత్యక్షమై ఋత్విక్కులను వారించి యజ్ఞమును సంపూర్ణముగావించెను.

*(సశేషం)*

**కర్మలను విత్తనాలతో పోల్చవచ్చు, ఏ విత్తమనవెూ ఆ ఫలాలనే పొందుతాము – అలాగే కర్మలు ఎటువంటివో, అటువంటి ప్రారబ్ధమును పొందుతాము**

✶ ✶ ✶

**నీవు నీ అహంకారాన్ని భద్రంగా దాచుకోదలిస్తే, విమోచనం గురించి, మనశ్శాంతి గురించి, ఆనందం గురించి మరచిపో**

**ఒక మంచి పుస్తకం ఏకాగ్రతతో చదివితే, . . .**

భారత భారతి

# 13. అనుశాసన పర్వము

*(గత సంచిక తరువాయి)*

- శ్రీ బొగ్గరపు గంగాధరశెట్టి

## 16) మౌసల పర్వము

ధర్మరాజు ముప్పది ఆరు సంవత్సరములు రాజ్యపాలన చేసెను. ఒకరోజు విశ్వామిత్రుడు కణ్వమహర్షి, నారదమహర్షి ద్వారకకు విచ్చేసిరి. సాంబునకు స్త్రీ వేషముచేసి, ఆ ఋషులను ఈ స్త్రీ బభ్రూ భార్యయని తెలిపి, ఈమె గర్భమున పుత్రుడా, పుత్రికా యని ప్రశ్నించిరి ? ఋషులు కోపగించి ఈమె గర్భమున ముసలం పుడుతుంది. దానితోనే వృష్టి వంశము నశించును అని శాపమిచ్చిరి. మా శాప ప్రభావము కృష్ణ, బలరాములపై ఉండదనిరి. ఆ శాప ప్రభావమును సాంబుడి గర్భమున ముసలం పుట్టిని. ఉగ్రసేనరాజు ఆ ముసలమును పొడి చేయించి సముద్రమున కలిపించెను.

యాదవులు ఒకరోజు ప్రభాస తీర్థమున శంకరుని పూజ అనంతరము విందులో తప్పత్రాగి ఒకరితోనొకరు కలహించుకొనిరి. ఆ కలహంలో కృష్ణుడు, బలరాముడు, దారకుడు, బభ్రువు తప్ప మిగిలినవారు మరణించిరి.

కృష్ణుడు స్త్రీలందరినీ నగరంలో విడిచి వచ్చెను. కృష్ణుడు తిరిగి వచ్చిన వెంటనే బలరాముని శరీరము నుండి సర్పాకృతి వెలువడి అనంతములో కలిసినది. వాసుదేవుడు ఒక చెట్టు క్రింద నడుము వాల్చెను. జరయను బోయవాడు కృష్ణుని కాలి బొటనవేలును పక్షయని భ్రమించి వదిలిన బాణము తగిలి కృష్ణుడు తన అవతారమును చాలించెను.

యాదవ వంశస్థుల మరణవార్త చారుల ద్వారా ధర్మరాజుకు తెలిసినది. అర్జునుని ద్వారకను పంపెను ధర్మరాజు. వసుదేవుడు వారము రోజులలో ద్వారక సముద్ర గర్భములో కలిసిపోవునని నగరవాసులకు తెలిపెను. అర్జునుడు మిగిలిన జనులను ఇంద్రప్రస్థం చేర్చుటకు ప్రయత్నించెను. వసుదేవుడు యోగనిష్ఠతో ప్రాణత్యాగం చేసెను. పిదప అర్జునుడు వసుదేవుని శరీరమును దహనము చేయించెను. వాసుదేవుని, బలరాముని భార్యలు అగ్నిప్రవేశము చేసిరి.

. . . మన దృక్పథం తప్పకుండా మంచివైపే పయనిస్తుంది

నేను, ద్వారకావాసులు ఇంద్రప్రస్థం వచ్చు సమయమున అడవిలో దొంగలు వారిని నానా హింసలు పెట్టిరి. నా అస్త్రములు దొంగల మీద ప్రభావము చూపలేదని అర్జునుడు ధర్మరాజుతో చెప్పెను. అపుడు వ్యాసమహర్షి ధర్మరాజుతో ఏది ఎప్పుడు జరుగవలెనో అపుడు విధాత జరిపించును విధివి పర్యయం అన్నమాట. శాంతించండననెను.

కృష్ణుడు వైకుంఠము చేరెను. ఇంద్రుడు స్వాగతము పలికెను. దేవతలు స్తోత్రము చేసిరి.

## 17) మహాప్రస్థానిక పర్వము

ధర్మరాజు పరీక్షిత్తునకు రాజ్యాభిషేకము చేసెను. మా మనుమని మీద మీ ఆదరాభిమానాలు చూపమని మరియు మా వంశప్రతిష్ఠను నిలుపుడు అని ప్రజలను కోరెను. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు, ద్రౌపది వానప్రస్థానికి బయలుదేరిరి. వారి వెంట ఒక శునకము కూడా బయలుదేరెను. వారందరు భాగీరథి ఒడ్డుకు చేరిరి. అపుడు అగ్నిహోత్రుని సలహామేరకు అర్జునుడు గాండీవమును భాగీరథిలో విడిచెను.

అనంతరము పాండవులు, ద్రౌపది హిమాలయాలు దాటిరి. మేరువు సమీపమున ద్రౌపది భూమి మీద పడి మరణించెను. భీముడు ద్రౌపది ధర్మగ్లాని చేయకపోయినను ఎందుకు మరణించెనని ధర్మరాజును ప్రశ్నించెను. అపుడు ధర్మరాజు, ద్రౌపదికి అర్జునుని మీద పక్షపాతమువలన మరణించెనని తెలిపెను. తదుపరి సహదేవుడు నేలబడగా భీముని చూసి ధర్మరాజు యిట్లనియె, వీడికి తనంతవాడు లేడనే అహంకారం ఉంది అనెను. పిదప నకులుడు పడగా, వీనికి తనంతటి సుందరాకారుడు లేడనే అహం ఉంది అనెను. తదుపరి అర్జునుడు పడగా, కౌరవులందరినీ ఒక్క రోజులో కడతేరుస్తానన్న ప్రతిన నిలుపుకోలేదు మరియు విలుకారులలో తనే గొప్పవాడని అహంకారం. తదుపరి భీముడు నేల వాలుతూ, అన్నయ్యా అనగా, నీ భుజశక్తితో కలిగిన క్రోధాహంకారమువలన అని ధర్మరాజు చెప్పెను.

ధర్మరాజు నడుస్తూ ఉన్నాడు. శునకం వెంట వస్తూ ఉన్నది. కొంతసేపటికి ఇంద్రుడు రథముతో వచ్చి ధర్మరాజును ఎక్కమని కోరెను. అపుడు ధర్మరాజు తమ్ములు, ద్రౌపది లేనిదే నేను రాలేనని చెప్పెను. వారిని స్వర్గలోకంలో చూడవచ్చుననెను. మహేంద్రా ! నా వెంట వస్తున్న సారమేయాన్ని కూడా ఎక్కించినచో నేను ఎక్కెదననెను. ఇంద్రుడు కారణమడిగెను. నా వెంట వచ్చిన శునకమును విడుచుట ధర్మమాయని ధర్మరాజు ప్రశ్నించె ? శునకరూపమున వున్న యమధర్మరాజు ధర్మరాజు ధర్మనిరతికి ప్రశంసించె. ధర్మరాజు సశరీరముగ అమరావతిలో ప్రవేశించెను. అనంతరము ధర్మరాజు శరీరమునును త్యజించి దివ్యలోకము జేరెను.

**తన బాధ్యతలను భగవత్సేవగా నెరవేరిస్తే ...**

## 18) స్వర్గారోహణ పర్వము

ధర్మరాజు కోరికననుసరించి ఇంద్రుడతని దూతను తోడుగా పంపి అందరినీ చూపించమనెను. ధర్మరాజు దూతతో తమ్ములున్న ప్రదేశము చూపమనెను. వారు ఒకచోట నిలబడినారు. అచట పాపఫలములను అనుభవించే జీవుల యాతనలు చూస్తూ దుర్గంధం భరించలేక ధర్మరాజు మనమింకా ఎంతదూరం వెళ్ళాలి అన్నాడు. ధర్మరాజు వెనుదిరుగుతూంటే, జీవులు, ధర్మరాజా ! నీ శరీరం నుండి వచ్చే గాలిచే మా ప్రాణులు తేలికపడుతున్నాయి. కనుక మీరు మరికొంతసేపు నిలబడి మీ పుణ్యఫలంతో మాకు సంతోషం కలిగించండి యనిరి. ధర్మరాజు, ఎవరు మీరు అని ప్రశ్నించగా, వారు కర్ణుడు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు, ద్రౌపది అని తమ పేర్లు చెప్పగా విని ధర్మరాజు మనసు వికలం అయి, అచటి నుండి కదలనుయనెను.

ఆ విషయం తెలుసుకుని దేవేంద్రుడు, యమధర్మరాజు అచటకు చేరిరి. వెంటనే ఆ ప్రదేశమంతా సుగంధభరితం అయినది. దేవేంద్రుడు ధర్మరాజుతో యిట్లనియె. రాజయిన వ్యక్తి పుణ్య, పాప ఫలానుభవం కోసం స్వర్గ, నరకాలు దర్శించక తప్పదు. ముందు నరక యాతనను అనుభవించిన తరువాత అమరలోక సుఖాలను అనుభవించును. అమరసుఖాల తరువాత యాతనలు తప్పవు. ఇది విధి. ఇపుడు మీ అన్న, సోదరులు, పాంచాలీ, మిగిలిన రాజులు, యోధులు మొదలగువారు అమరసుఖాలు అనుభవిస్తున్నారు. రా ! వారిని చూచి ఆనందించవచ్చు అనెను. ధర్మరాజా ! నియద్గంగా తరంగిణిలో పరిశుభ్రస్నాతుడవై మా వెంట వచ్చి స్వర్గభోగాలు అనుభవించు అనెను. తదుపరి ధర్మరాజు మందాకినీ నదిలో స్నానం చేసి దివ్యదేహమును పొందెను.

పిదప ధర్మరాజు దేవతాంశములో లీనమైన సోదరులను, బంధువులను, పితృ, పితామహులను దర్శించెను. అమరావతిలో శాశ్వత స్థానం పొందెను. వైశంపాయనుడు మహాభారతమును ముగించెను.

భారతము సమస్త పురాణముల ధర్మశాస్త్రములతో సమానము. పంచమవేదముగా కూడా ప్రసిద్ధికెక్కినది. జయ అను భారత ఇతిహాసమును భక్తి, శ్రద్ధలతో చదివినను, వినినను ఐశ్వర్యము, కీర్తి, విద్య లభించును. వ్యాసమహర్షి ధర్మ ప్రచారము కొరకు భారతమును రచించెను.

**కృష్ణార్పణమస్తు**

**... స్వార్థ భావన లేకుంటే కర్మబంధాల నుండి విముక్తి లభిస్తుంది**

## ఫలశృతి

కపిలబోవు కొమ్ములకు, గిట్టలకు స్వర్ణము పూసి
వేదవేత్తలకు దానమిచ్చిన ఫలము, భారతము చదివినను
వినినను కలుగునని ఆర్యుల ఉవాచ.
కళ్యాణమయమహాభారతమును వినువారు పుష్కర తీర్థ
జలమున స్నానమాచరించుటచే వలయు పుణ్యము లభించునని
వేదమూర్తుల ఉవాచ. వేదముల సారమైన భారతమును
పఠించువారు, వినువారు మఱియు ఇందలి ధర్మములను
ఆచరించువారు ధన్యులు విద్య, కీర్తి, ఐశ్వర్యము పొందెదరు
భారతమున విష్ణువు దివ్యకథలు, సనాతనశ్రుతులు యుండుటచే
ప్రతి మానవుడు పఠించవలసిన గ్రంథము

భారతమును భక్తి శ్రద్ధలతో వినువారికి కీర్తి, విద్య, ఐశ్వర్యము ఆయురారోగ్యములు తప్పక లభించును.

**ఓం తత్ సత్**

సమాప్తము

**నీవు ఈ భూమిపై జన్మనెత్తినప్పుడు, నీ వెంట ఎంత మందిని తీసుకవచ్చావు ? అంతిమ సమయం ఆసన్నమై నీవు ఈ భూమిని విడిచి వెళ్తున్నప్పుడు నీ వెంట ఎంత మంది వస్తారు ? ఈ భూమిపై నీవు ఏకాకి అయిన యాత్రికుడవన్న విషయం సత్యం కాదా ?**

***

**ఆత్మ విమర్శ, విశ్లేషణ, వినయ, విధేయతలు లేకుండా ఎల్లప్పుడూ తనలోని మంచినే చూస్తుంటే ; ఆధ్యాత్మిక మార్గంలో ప్రగతి వికాసం, స్వయం అభివృద్ధి ఆగిపోతాయి**

***

**భగవంతుణ్ణి చేరడానికి, శాశ్వతత్వాన్ని, శాశ్వతానందాన్ని పొందడానికి సులభమైన, వేగవంతమైన, సురక్షితమైన, నమ్మకమైన మార్గం - జపం**

భగవంతుని పట్ల హృదయపూర్వక భక్తి, ప్రేమ వుంటే, ఈ ప్రపంచంలోని , . . .

గురు భారతి

# శ్రీ గురు స్తుతి

– డా॥ రాజేశ్వరీ సుబ్రహ్మణ్యం

పల్లవి : శంకరా ఆదిశంకరా – తాత్త్విక జ్ఞాన ప్రకాశ

1) చ॥ మానవాళికి – జ్ఞాన సంగీత సుధ
వేదాంత ధార్మిక శాశ్వత సత్యము
అందించిన జ్యోతిర్మయా – నమస్తుభ్యం ॥శంకరా॥

2) చ॥ పరిపూర్ణ దివ్యత్వం నిర్గుణ బ్రహ్మం
ఆత్మనివేదనం అహం బ్రహ్మాస్మి భావం
అందించిన తేజోమయా – నమస్తుభ్యం ॥శంకరా॥

3) చ॥ పరివ్రాజక పరమేశ్వర సాక్షాత్కారం
ఆధ్యాత్మిక అద్వైత తేజోరాశీ
వివేక చూడామణీ – నమస్తుభ్యం నమస్తుభ్యం ॥శంకరా॥

✶

నీవు ఆచరించే ప్రతి కర్మ మానవజాతిగా దర్శనమిచ్చే ఆ దివ్యత్వం పాదాలకు అర్పించే పుష్పంలో వుండాలి

✶✶✶

ఆత్మ విమర్శ, విశ్లేషణ, వినయ, విధేయతలు లేకుండా ఎల్లప్పుడూ తనలోని మంచినే చూస్తుంటే ; ఆధ్యాత్మిక మార్గంలో ప్రగతి వికాసం, స్వయం అభివృద్ధి ఆగిపోతాయి

. . . ఏ విషయం కూడా నిన్ను ప్రేరేపించదు. కోరికలను త్యజించడం సులభతరమవుతుంది

తత్త్వ భారతి

# రమణతత్త్వము

- బొప్పన కృష్ణప్రసాద్

ద్వైతం, అద్వైతం అనే పదాలు సాపేక్షాలు. ద్వంద్వ భావనపై ఆధారపడిన ఉన్న రీతిలోనే ఉంటుంది ఆత్మ. దానికి ద్వైతం లేదు. అద్వైతమూ లేదు. 'నేనదే నేను' కేవలం స్థితియే ఆత్మ అంటారు శ్రీ భగవాన్.

మనసే మాయ. సత్యం మాయకు అందదు. మనసు పనిచేసేనందకాలం ద్వైతం మాయ ఉంటుంది. దానిని ఒకసారి దాటిపోయామా, సత్యం సర్వాన్నీ దీప్తింపచేస్తుంది. నిజానికి ఆత్మ స్వయందీప్తము. అది సచ్చిదానందము. 'సత్ చిత్ ఆనందము' అనటం 'అసత్ అచిత్ అనానంద'లు కావు అనుటకే. మనం విజయం జగత్తులో ఉన్నాము. కనుక ఆత్మను సచ్చిదానందము అని వ్యవహరిస్తాము.

అహం పదము వ్యక్తికీ, బ్రహ్మమునకూ కూడా వర్తిస్తుంది. అది ఉపాధి భేదమువలన వచ్చినది. జీవునికి చెందిన 'అహం' దేహానికీ పరిమితం. బ్రహ్మమును సూచించే 'అహం' విశ్వానిది. ఉపాధిని తొలగిస్తే ఉండే 'అహం' ఏకమూ, శుద్ధము.

గురు శిష్యుల భేదాలు విషయ జగత్తు దృష్టానే గాని, సత్య దృష్ట్యా అసలే లేనే లేదంటారు మహర్షి.

ఉపదేశాలు అనేవి శరణాగతి చేయలేనివారికే అవసరం. ఒకసారి సంపూర్ణ శరణాగి పొందావా, నీ గురువు నీలోనే ప్రత్యక్షమవుతాడు. నిన్ను నడిపిస్తాడు.

సాధకునికి జ్ఞాని ఆత్మసిద్ధి కాలేదే అన్న భ్రాంతిని పోగొట్టుకోవటానికి సాయం చేస్తాడు.

విచారణ జ్ఞానయోగమని, శరణాగతి భక్తియోగమని అనుకొంటారు. కాని నిజానికి రెండూ ఒక్కటే. తేడా ఏమీ లేదు.

నీకు వాస్తవంగా విమోచనం, స్వేచ్ఛ పొందాలనే కోరిక వుంటే నీ కోరికలను అంత తగ్గించుకో

'నేను శుద్ధ చైతన్యాన్ని' అనే తర్కం వల్ల నిరూపణ జరగటం ఒక యెత్తు. అది 'సరి' అనే నమ్మకం కలగటం మరొక యెత్తు.

సత్యమొక్కటే సిద్ధి అనేది భ్రాంతి. అభ్యాసము కావలసి యున్నది. సిద్ధి ఇప్పటికప్పుడే లభించి యుండక, క్రొత్తగా వచ్చేది అయితే, దానివల్ల ప్రయోజనము లేదు. శాశ్వతమయినది ఎల్లప్పుడూ ఉండాలి. క్రొత్తగా సిద్ధించేది కలకాలముండదు కదా ! అందుకే ఎప్పటికి ఇక్కడే ఉండేదానిని సాధించు. పూర్వం యోగులు అలాగే సాధించారు. ఎప్పటికప్పుడు సిద్ధి కలుగుతున్నది కనుక అది క్రొత్తగా కనిపిస్తుంది. ఒక్కమారు అజ్ఞానం కప్పేసి, దానిలో నుండి యబటపడితే, క్రొత్తగా దొరికినట్లుగా తోస్తుంది. కాని అందులో క్రొత్త ఏమీ లేదంటారు మహర్షి.

మానవుని నిజమయిన పేరు ముక్తి. దైవం వేసి యుంచిన ప్లాను పాలించబడుతుంది. ఏం జరిగితే మాత్రం సంతాపమెందుకు అంటారు మహర్షి.

దేవుని కృప అపారమయినది. పూర్వజన్మ స్మృతి మనకు లేకుండా చేసినాడు. తాము పూర్వజన్మలో పుణ్యశీలురమని తెలిస్తే, ఇక వారి గర్వానికి అంతుండదు. అలాకాక పాపం చేసినవారని తెలిస్తే, వారికి ఎంతో నిరావ, దిగులు, నిరుత్సాహం కలుగుతాయి. ఏదీ మంచిది కాదు. అందుకే తనను తాను తెలుసుకుంటే అంతే చాలంటున్నారు భగవాన్.

సముద్రం చేరాక, నదికి ప్రవాహము ఆగిపోయినట్లుగా, మనుజుడు కూడా, ఆత్మలో లీనమైనాక, అన్ని కర్మలనూ ఉజ్జగిస్తాడు.

ఉపదేశం వినేవాని స్థితిని బట్టి ఉంటుంది.

అక్షరమణిమాలలో ఒక పాదాన్ని ప్రస్తావిస్తూ భగవాన్ అంటారు. "ఉపదేశాలలో ఉత్తమోత్తమము మౌనము. నిశ్శబ్దమే గురువు. శిష్యుడు సాధకుడూ" అని మౌనంగా కూర్చుంటే పనులు జరిగేదెలా ? కర్మయోగానికి స్థానమేది అని సందేహం కలిగింది. వినేవారికి, అందుకు మహర్షి బదులిస్తూ, 'మొదట కర్మ అంటే ఏమిటి? ఎవని కర్మ కర్త ఎవరో తెలుసుకో. వానిని బాగా పరిశీలించి, యథార్థం ఏమిటి అని విచారిస్తే, విధిగా అతడు శాంతుడూ, ఆత్మస్థితుడు అవుతాడు. కర్మలు సాగుతూనే ఉంటాయి.

జ్ఞాని పరముడు. అతని స్థితిని ఎంత వర్ణించినా, అది నీ శక్తి మేరకే అర్థమవుతుంది. ఎందుచేతనంటే నీ శక్తి పరిమితము. శ్రుతులు ప్రకారం ఆత్మస్థితికి అవధులు లేవు. కనుక

**విజయాన్ని ధనంతో కొనలేము - నిరంతర కృషితో సాధించగలము**

ఆత్మజ్ఞుడిని అర్థం చేసుకోవటానికి, ఆ స్థితిని సాధించి, అనుభవించవలెనే గాని, వేరొక విధంగా సాధ్యం కాదు.

ఉపనిషత్తులు 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నాయి. బ్రహ్మను తెలిసిన వాడు బ్రహ్మమే అని అర్థం. ఏకకాలంలో అనేకులు బ్రహ్మవిదులుంటారు. బ్రహ్మవిదులు ఆత్మజ్ఞతలో బేధం లేదు. దేహంగా భావిస్తే వారు వేరువేరుగా కనిపిస్తారు.

బౌద్ధులు ప్రపంచాన్ని నిరాకరిస్తారు. హిందూ వేదాంతము జగత్తును అంగీకరిస్తూ అది మిధ్య అంటుంది. భిన్నదృష్టులు కనుక భిన్నాభిప్రాయాలు.

జగత్తును శక్తి సృష్టిగా అందరూ అంగీకరిస్తారు. అది సృష్టి స్వభావాన్ని సమర్థించేదిగా ఉండాలి. సృష్టికర్త స్వభావము సృష్టి స్వభావ సదృశమే కావాలి.

మాయయే ఒక మాయ. దాని కవ్వలివాడే దానిని చూడగలడు. ఆ సాక్షి మాయకు లోబడనివాడై ఉండాలి. అతనికి తరతమాలుండవు. సినీతెరపై దృశ్యలెన్నో కనిపిస్తాయి. అగ్ని సౌధాలను కాల్చినట్లు దృశ్యము కనిపిస్తుంది. అయినా తెర కాలిపోదు. ఎందుచేతనంటే తెర యదార్థం కనుక. దృశ్యాలన్నీ కల్లలే.

ఎన్నో చిక్కులలో, దరువస్థలలో చిక్కించి, భక్తులను దైవం చాలా కఠినంగా పరీక్షిస్తాడు. అవన్ని అతని సాధనను మరింత పదును పెట్టటానికే.

"మనసు నియమించినవానికి తపస్సుతో పనేమి? తనువు తానను బుద్ధి విడిచి, నేను కాదు, సర్వమూ నీవే అని తెలుసుకో" అంటాడు త్యాగరాజు. అది సంపూర్ణ శరణాగతి వలన సాధ్యమంటారు శ్రీ భగవాన్. "హృదయ సంవాదమును మించిన మాటలు లేవు. అన్ని భాషణలూ నిశ్శబ్దంలోనే పర్యసించవలె" అంటారు భగవాన్.

జ్ఞాని విషయంలో పై చూపులకు మోసపోరాదు అంటుంది వివేకచూడామణి. ప్రారబ్ధంవల్ల దేమంతోడి పొత్తుబాయని జీవన్ముక్తుడు, ఒరుల దృష్టిలో అజ్ఞానంలో మునిగియున్నట్లు అగుపించినా, వివేకిగా వెలిగినా, అతడు ఎప్పుడూ ఆకాశం వలె నిర్మలుడే సమా ! జ్ఞాని సదా ఆత్మికరాముడు.

జ్ఞాని ఒక్కోసారి విద్యాగంధమే లేనివానివలె మూగగా ఉండవచ్చు. ఉదాసీనుడై ఉండవచ్చు. శిష్యులకు ఉపదేశం చేస్తూ ఉండవచ్చు. కాని తాను గురువునని గొప్పలకు పోడు. గురువూ, శిష్యుడు అనే మర్యాద మాయాజనితం కనుక. అతనికి తీరవలసిన కోరికలుండవు. అతనా జీవన్ముక్తుడడు. అతడు దేహధారియై యుండుట ప్రపంచ కళ్యాణానికే.

*(సశేషం)*

**మధుర స్వభావులే మహానుభావులు**

ధర్మ భారతి

# జ్ఞాన గంగాలహరి

**హిందీ మూలం : స్వామి శివానంద** **అనువాదం : ఆచార్య కసిరెడ్డి**

జీవితంలో గుర్తుంచుకోదగ్గ ఆరు అంశాలు ఉన్నాయి. అందరూ వాటిని స్మరించుకొంటూ ఆచరణలో పెట్టాలి.

సేవ చేయండి, స్నేహం చేయండి, ఇస్తూపోండి, పవిత్రంగా ఉండండి, ధ్యానం చేయండి, అనుభవాలను సంకలనం చేసికోండి !

ఇవి సర్వమతాల పవిత్ర గ్రంథాల మౌలికాంశాలు, మూల తత్త్వాలు.

ఈశ్వర నియమాలు, ప్రకృతి నియమాలు తెలుసుకోవడం మంచిదే, కానీ అంతటితో ఆగరాదు. మీరు వాటిని జీవితంలోకి తెచ్చుకొనే కళ కూడా తెలుసుకోవలసి ఉంది.

నీ దగ్గర ఏముందో దానిని ఉపయోగించు, దానివల్ల ఆ ఉన్నదేదో అది దినదినం వికసించే అవకాశం కలుగుతుంది.

ప్రతి సమస్యననుసరించే దాని పరిష్కారం కూడా పుడుతుంది, అందుకే మరి సమస్యల్ని చూచి భయపడాల్సిన అవసరం లేదు. ధైర్యం కోల్పోవాల్సిన అవసరం అంతకన్నా లేదు.

సమస్యలు జీవితాన్ని గురించి ఆలోచించడానికి శక్తినిస్తాయి. రుచినీ మాధుర్యాన్నీ పెంచుతాయి. సమస్యలు మీ విషయంలో వరాలనుకోండి ! సమస్యలనేవి సాహసకార్యాలు చేయడానికి సవాళ్ల (ఛాలెంజ్‌లా) రూపంలో వస్తుంటాయి.

ఎదురుదెబ్బలు, అణచివేతలు, ఎన్నో మానవునికి అనుభవపూర్వక విద్యలే. ఇవి మరే సాధనాల ద్వారా మనిషి పొందలేడు.

అపజయాన్ని ఇంకా ఇంకా పనిచేయాలనే ప్రేరణగా భావించి స్వీకరించు. దానివల్ల నిర్భయుడవై, శాంతి, పట్టుదల, దృఢత్వం మరీ పెంచుకొని నీ మార్గంలో వీడకుండా ముందుకు సాగిపో. నీకు అపూర్వ అత్యధిక విజయ సాఫల్యం లభిస్తుంది.

**మంచితనాన్ని మించిన సంపద లేదు**

ఓటమి నుండి శాంతినీ, స్థిరత్వాన్నీ సహన శీలత్వాన్నీ నేర్చుకో.

మానవుడు ఆశాజీవి, అశయే మానవుని ఆకాంక్ష, అంతేగాక లాలస కూడా. ఆశనే మానవుణ్ణి కార్యకర్తగా, క్రియాశీలునిగా, ఆకాంక్షా పరిపూర్తికై నిలిచే వ్యక్తిగా, ప్రార్థించే వినయశీలునిగా కూడా తీర్చిదిద్దుతుంది.

హిమాలయ ధ్వని అంటే భారతీయ ఋషుల ధ్వని. ఆ హిమాలయం అసంఖ్యాక జీవులకు ప్రేరణను, సంతోషాన్ని, శాంతినీ ప్రదానం చేస్తున్నది.

హిమాలయాల్లో ఏకాంత ప్రదేశాలున్నాయి. అవి ఉన్నత సువిశాల నగరాల్లోని భవనాల కన్నా వీధులకన్నా గొప్పగా ఉన్నాయి.

ఏకాంత ప్రదేశం ఉన్నత దైవీ చింతనను మనకు ప్రసాదిస్తుంది.

కాంతి ఒక లక్షా ఎనభై ఆరువేల మైళ్ల కన్నా ఎక్కువ దూరం ప్రతిఫలిస్తూ, అంతకన్నా ఎక్కువ వేగంతో పరిగెత్తుతుంది. సూర్యుని కాంతి భూమి దగ్గరికి రావడానికి దాదాపు 8 1/2 నిమిషాల కాలం పడుతుంది. సూర్యునికీ, భూమికీ ఉన్న మధ్య దూరం దాదాపు 20 లక్షల మైళ్లు. మన సమీపంలోని అంధకారాన్ని చీల్చుకొని ఆ కాంతి రేఖ ప్రవేశించడానికి కనీసం మూడు సంవత్సరాల కాలం పడుతుంది. అందుకే ఓ మనిషీ ! ఈ దేశ కాలాలను పరమాశ్చర్యంతో మననం చేసుకో ! మనసుకు పట్టించుకో ! దీనిని రచించిన ఆ రచయితను గుర్తించడానికి నీ అనుభవం ఎంత సరిపోతుందో ఓ సారి ప్రయత్నం చెయ్! ఇది ఎంత మహాద్భుతమైన ఆశ్చర్యం ! ఓహెూ ! ఆశ్చర్యాల్లోకెల్లా వాస్తవికమైన పరమాశ్చర్యం !

బ్రతికి ఉన్నన్ని నాళ్లు నేర్చుకోవాలనే కోరుకో, ఎప్పుడూ విద్యార్థిగానే ఉండు.

భావుకుడు ఎప్పుడూ భావన మీదనే జీవిస్తాడు, మరణిస్తాడు, అందుకే భావనను ఎప్పుడూ బుద్ధితో నియంత్రించాలి.

నీ నిశ్చయబుద్ధిననుసరించే ఎప్పుడూ పనిచేయడానికి సాహసించు.

నీకున్న దాంట్లోనే సుఖంగా సంతోషంగా – ఆహ్లాదంగా జీవించడం మంచిది. ఇంకా చెప్పాలంటే దుఃకాలలోనూ ఏ వ్యక్తి సంతోషంగా ఉంటాడో అతనే అభినందనలకు ప్రశంసలకు పాత్రుడవుతాడు.

✶

**ఔన్నత్యం సంపదవల్ల కాదు, సద్గుణాలవల్ల వస్తుంది**

# THE NATURE OF MEDITATION AND ITS PLACE IN LIFE

- Swami Chidananda

Glorious Immortal Atman! Blessed Children of Light and Immortality! Beloved Seekers on the Pathway to the Divine! How privileged we are to be able o gather here in this holy morning hour to bathe ourselves in the glorious stream of meditation and the Divine Name. Such an hour is a gift from God. It is a bestowal of love from One who is our source, One in whom we eternally ibide, and in whom we are all one. Such a gift should be accepted with love and reverence, and with devotion should be utilised by us all. Indeed, the oken of our true recognition of God's continuous compassion and grace upon us would be to ever try to make ourselves worthy of such marks of His grace and to that extent we would be drawing nearer and nearer to Him. We should ourselves live our lives in such a. way that, seeing one of us, He, the indweller (who knows our true aspirations, our innermost desires) would tell Himself, "Here is a child that has wearied of the toys of this mortal earth-plane, that has wearied of the appearance, the names and forms, of this great game of Mine, this drama of life, and now wishes to turn to Me and, therefore, I should not tarry." Thus recognising, He brings into the life of one who is truly in need of Him, who truly desires Him and Him alone, who is earnest in his quest, all which is needed for his spiritual unfoldment and the attainment of the highest.

The yearning, the strong aspiration, therefore, is our part. That is the step the finite takes, and that being sincere and earnest, the fulfillment of it becomes His task. Thus, it is that the great Master Jesus said, "Ask and it shall be given." The asking of it is the task of each individual soul and the giving of it is verily the Father's task through wise love. And,

సేవించకు మద్యం - జీవితాన్ని చేయునది ఛిద్రం

as sure as the glorious dawn and the radiant sun do follow the darkness of the night, so sure and certain is the fulfillment of the true aspiration of the sincere soul in earnest quest of the Supreme. Such occasions as this—of prayer, of prayer, of worshipfulness, of meditation - are not only proofs of the tangible presence of Grace in our life, but from our part is proof of our sincere desire for Him. Every time we turn away from earthly pursuits, every time we set aside mere things of this world and collect ourselves in the stillness of our inner being, and sit to worship Him, call goes out to the Infinite, "Here I am. I need You. Be Thou gracious. Reveal Thyself unto me. I turn away from the passing and seek the Eternal". It becomes as it were, a true token of the sincerity and earnestness of the soul, of the innermost being's sincere desire.

Meditation, therefore, is the exercise of the deepest part of your being. It is, in truth, the highest and the noblest exercise of the suprem prerogative, the supreme blessedness of human birth. There is no exe ercise loftier than worship upon this earth-plane. Let us be thankful, therefore, for this beautiful morning, for this solemn hour and for the privilege of sitting at the altar of the Divine Presence, entering into the silence and bathing ourselves in the glorious radiance of His presence. Let us be thankful for this privilege of trying to purify ourselves of all that is earthly within us, trying to fill ourselves with the Divine. Such acts of meditation form but a variation of the process which our entire life is meant to be. Our life is meant to be a constant opening of ourselves unto the Divine—a process of stilling our mind, a constant process of turning awa from the perception of the non-self, a continuous process of rejecting the call of the non-eternal upon our being and a resolute, a persistent, and an insistent opening of ourselves to th Atman, to the Imperishable, to the Eternal. Our entire life is meant to to an attempt to turn away from the unreal and move towards the real, ai attempt to reject the pull of darknes;

ఎక్కువ కోరికలే సమస్యలకు మూలం

and seek light and light alone, a resolute rising up from this plane o mortality to the recognition of the immortal nature of the Self within. Anc meditation is the same procesi intensified in a systematic anc deliber-ate way, canalised at a specifu time. Meditation is .the intensifiec living in the Spirit, and our entire lift (and its movements) is a diffused flov of the spirit of meditation, of the spiri of our spiritual quest. These tw( pro-cesses, therefore, should have nc specific break or barrier separating them. Meditation should supply the dynamism for our living. Meditatior should be the re-charging of our lift battery in an intense manner Medita-tion should be the spiritualising force for all our life, for all oui thoughts, feelings, ideas, sentiments and aspirations, for all our dealings with the world. Our perception of tht whole world and of all life should be £ move-ment fully bearing out the innei spirit of meditation. These two, viz., life and meditation, are continuous processes. They are not two processes with a clear-cut separating barrier.

Meditation is not some isolated act that you do in life and which has no bearing on life, which is entirely of a different nature altogether, and something which goes against the normal current of your life. Yet, it may be going in a direction opposite to the normal current of your lower self, of the desire nature of the mind, of the object-ward movement of the senses. Such outward movements are the inherent tendencies of the mind and meditation may go in opposition to these, but these out-ward movements do not constitute your Self; the senses do not consti-tute your Self; the mind and the desire nature do not constitute your Self. Your true being is as a river rushing towards the ocean. Thus, in that being, there should be no separation between your meditation and your living. If this point is not borne in mind, you will find that between medita-tion and the rest of your day-to-day life, there is a sharp divergence, and meditation becomes, as it were, a tug-of-war with the impulses gener-

ated by your day-to-day life. It becomes a hard process—one part of the mind contradicting the other, opposed to the other, with much waste of essential energy. There is much conflict within, in the self of the being. The harmony, the peace and the joy with which meditation can flood your being and fill your countenance, lack in your expression; even though you meditate, there is not the calmness in the eye. But where this inner secret has been recognised and life and meditation go hand-in-hand, are fully in sympathy and rhythm, one finds that in such a meditator the calmness of meditation flows through his life; the peace of meditation shines through hi? eyes; the joy of meditation pulsates anc radiates through his entire being Such, indeed, is the place of meditatioi in your life. Such, indeed, is the role o meditation in the day-to-day living of your entire being.

✶

When you practise Yoga, certain Siddhis like celestial scents, sounds, sights, the most agreeable sensations of taste and touch, pleasurable sensations of coolness and warmth will come to you. Disregard them. Shun them, as they will bind you and cause distraction and downfall. They are distractions on your path. March forward and try to attain the summit of Nirvikalpa Samadhi.

***- Swami Sivananda***

సహనం సముద్రం కన్నా పెద్దది

# SELF ENQUIRY

- Smt. Vanasri

Self-enquiry, the context is human condition itself. We are haunted by a dream of perfection i.e perfect happiness, perfect joy and perfect peace. We always try to overcome suffering in order to get constant happiness. Consciously or unconsciously every human soul is chasing it in many different ways. Desires arise one after the other. The happiness resulted after that desire is fulfilled, remains for a short period and again mind goes for another desire thriving for something else. Whatever it is we call this desire, a search for Truth, for every human being there is some unknown internal urge for permanent happiness. *Vedanta* says it is true and it is not a false quest. There is something within us that corresponds to this search. But this search is not properly directed but looking in the wrong direction. From the time we took birth we are chasing for that happiness in the world around. The central quest of happiness is money. People believe that more money gives more happiness. They may say money cannot give happiness but at the back of their mind there is a slight feeling that if he is a milliner he would have had more comfortable life. Where do we find happiness? Where do we get everlasting peace? It seems to be everlasting quest of every human soul. It seems nowhere in the outside the world. Even relationships are with tremendous expectations going to end disastrously. Mundaka Upanishad says;

**Paranchikanivyathrunatsvayambooh,**
**Tasmatparampasyatinaantaratmanll**

The Lord has made all our senses in his wisdom in such a way that they flowoutward only. Mind understands the world through the perceptions of these senses. Human beings are crushed in between the mind and senses.

There are some classes of people from different cults and religions, who could find solution to this problem. There are some saints

ఆవేశపూర్వక నిర్ణయాలు అనర్థాలను తెస్తాయి

and mystics who claimed to have found something that give them deep and ever lasting peace and happiness. We always look outside of the world where we find attractive objects, but we do not bother to find what is within us. The central message of *Vedanta* is what we are looking through our entire life is not outside but within us only. In fact it is you, your real nature. The essence of entire *Vedanta* is stated in the so called great sentences of profound Mahavakyas;

"*AhamBrahmasmi*"; I am *Brahman*. The very self within us is *Brahman*, the Infinite.

"*Prajnanam Brahman*"; The Individual Consciousness is universal Consciousness, the *Brahman*.

"*Ayamatmabrahman*"; I am *Brahman*, the very self is *Brahman*.

"*Tattvamasi*" That you are. You are that *Brahman.*

The real self of ours, the goal of *Vedanta* is always within us, all the time, According to *Vedanta* the goal of human life is self-realization, but the individuals are looking for, in the opposite direction.

All religions, all paths lead back to find what is within us. If some asks "does God exists?" "yes", If so, where is He? 'O' He is in heaven! If He is really in heaven, I at least have an excuse that, It is very far and distinct and far away from us and not reachable. Hence it is not possible to see Him. But *Isa Upanishad* says; '*Isavasyamidamsarvam'*

This entire universe is enveloped or perceived by *Isha*, the God. He is in all space, all time, in all things. Nothing is left without *Brahman*. In such a case he must be present here right now everywhere; nothing is different from *Brahman*. But problem is we are not able to see Him. Let alone everywhere I do not see Him anywhere. Let alone in all objects I do not see it in anything. Where is the problem in knowing Him and seeing Him? *Vedanta* gives us assurance if anyone aspires and wills to know Him he will surely experience It. 'Yes' it is true and not impossible. In fact it is nothing but his inner spiritual Reality. The only thing that keeps everybody away from experiencing it is only one's own ignorance. Then how to come out of this ignorance and see Him?

ఆవేశం వివేకాన్ని నశింప చేస్తుంది

If I see a person, whom I saw him some time back, he can be recognized now. How this happens? It is something behind and within me introduced that person to me. Someone from behind supplied this information in recognizing him. In the same way to introduce us to our own self, there is a process. The whole idea here is to remove ignorance from our own nature by knowledge about our own nature.

*Avidya* is removed by vidya. *Ajnamvijnah.* But there is a condition! That knowledge can remove ignorance only when knowledge and ignorance are in same locus. If I am ignorant of Spanish there is no use of learning German- The object of ignorance and its knowledge should match. Here in this case I am ignorant of myself. What we need is, we want something to introduce us to the *Brahman*, our own self, in our own experience. *Ashraya* and *vishaya* in Sanskrit, the object of ignorance and object of knowledge should match. So far we are thinking that we are this body, senses, mindand*Prana*. Swami Vivekananda says 'if you know yourself as you truly are'. *Vedas* are going to show us our hidden treasure within us. There is a saying that 'people in the world are sitting on the shore of ocean of nectar and die of thirst. They don't see it. One may ask a question that when I am seeing my self what introduction do I need ?

*Vedanta* takes us to see our own self through a process of enquiry. To discover our inner true nature we must set up a commission of our self. The central approach of *Advaita Vedanta* is such a commission to enquire our own true nature.

It is a method of self-enquiry, enquiry by our-self into our-self with the aid of *Vedanta*. There are different processes for this approach, like;

Enquiry into three states of mind i.e*Jagrat, swapna*and*sushipti.*

Enquiry into *Panchakoshas* or sheaths called *Annamaya, pranamaya, manomaya, vijnanamaya*and *anandmaya.*

*(Continued....)*

మనకు అవసరాలు గుర్తున్నంతగా సామర్థ్యాలు గుర్తుండవు

# JIVATMA-PARAMATMA IYKYAM

- Sivananda Muthuraman

This is further confirmed by the words of Sri Rama during the Rama-Ravana Yudha. He said to the Devtas who questioned Him “Hey Rama you are all pervading and all knowing Brahman. Then why you are delaying the Ravana samharam. If you think, within a fraction of second you can kill him. Sri Rama patiently heard and replied to Devtas like this - “ATMANAM MANUSHAM MANYE RAMAM DASARATATMAJAM” meaning “This Rama standing before you is manushya Atma, the Son of Dasaratha Maharaja”, and so cannot go in the way of Adharma by showing my celestial power”. So I should only follow the Manushya Dharma”. Sri Adi Sankara says in the Bhajagovindam “maya mayamida makilam hitwa” - means free you from the illusion of the world of maya. The Atma within us stays purely as temporary identity which finally merges in the Paramatma (who is eternal).

This is just like when we execute any legal/registration document we give our temporary address as also the permanent address. Once we vacate the temporary place of stay, we move to our permanent placeof stay. Though the places are different, the executor remains the same man. So our life ambition also should be to move out of our temporary location i.e. mundane world to our permanent place of happiness i.e. Paramatman, and for which we have to prepare ourselves for an internal journey.

We all know that we undertake two types of journey. One is outward journey and the other is inward journey. Now let us see the outward journey - For example, if we want to go to pilgrim town Varanasi, first we seek the journey details through Railway time table to find out which are all the trains available, ticket charges, class of accommodation available, distance involved, duration of travelling time etc., to reach the destination Varanasi. If confirmed tickets are available, we purchase and then pack our things. On the day of travel we reach the particular Railway station well in time by engaging available mode of transport to board the train and reach the destination Varanasi. Here our external journey ends successfully and our travel ambition is fulfilled.

Similar to that is inward journey. It means that we have to focus our mind inside sukshma sarira (All living being has two Sariras – one is

ఆనందం వస్తువులలో ఉండదు - మనసులో ఉంటుంది

Sthoola Sareera (gross body) and the other is Sukshma Sarira, wherein Atma and Paramatma resides. Both are invisible to us because of maya (illusion) within us.

As we undertake the outward journey, in the same way, the inward journey also has to be commenced. For this, first we must prepare ourselves fit to undertake the inward journey. The Vedas, Sastras, Smiritis, Puranas, Itihasas, Yoga Sutras through Maharishies, elaborately reveals that one must have purity of thought, keep away from worldly thoughts to get material benefits, discharge the designated varnasrama duties, develop intense desire to see the Paramatman.

Overnight we cannot achieve this state of oneness with the Paramatma. Step-by-step we have to prepare ourselves for that. The Yoga Sutra of Patanjali Maharishi which Sri Adi Sankara also opines is that it stipulates various means of initial preparation required to be followed by a seeker. In short these are - avoid jiva himsa, speak truth, avoid jealousy, be content with what you get, do not to aspire for others belongings, regularly study the religious texts, be benevolent and so on. This way we have to start by keeping our body, mind and Intellect fit to undertake the Inward journey.

When once our inward journey is commenced, the next stage is that we have to aim for reaching the final stage of oneness with the Paramatma which should be our jeevita lakshyam. Through yoga also we reach the Samadhi state uniting with the Paramatma. We should seek the blessings of a spiritually enlightened Master who guides us in the right path. Enlightened Master means that one who realized that Paramatma lives within everybody without any exception. Gitacharya says in the Bhagavad Gita (Ch.VII.Vs.19) that VASUDEVA: SARVAMITHI SA MAHATMA SUDURLABHA:

We are adequately guided in the Guru Stotram –

**DYANAMOOLAM GUROR MURTHI: PUJA MOOLAM GUROR PADAM,**
**MANTRA MOOLAM GUROR VAKYAM MOKSHASMOOLAM GUROR KRIPA.**

Wwe must make sincere efforts by keeping full faith in the Hindu Sanathana Dharma, Vedas, Sastras, Sacred Religious Texts, and Gurus, by our disciplined mind and proceed in the right path shown by them to achieve our jeevita lakshyam i.e. JIVATMA-PARAMATMA IYKYAM and thus escape from the clutches of re-births. Sri Adi Sankara says in Vivekachudamani that "JANTHOONAM NARAJANMA DURLABHA MATHA: So this we must achieve in this very birth itself.

HARIHI OM TATSAT.

✶

ముఖస్తుతి నచ్చే వారికి ఉత్తుత్తి మాటలతోనే కడుపు నిండుతుంది

## ప్రకటన

# ఆధ్యాత్మిక సాధకులలకు సదవకాశము

"దివ్యజీవన సంఘము" నకు చెందిన "యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ" 90వ యోగ వేదాంత తరగతులను 16-08-2018 నుండి 14-10-2018వ తేదీ వరకు రెండు మాసములకొరకు నిర్వహింపనున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందాశ్రమ ప్రాంగణమునందు జరుగును. 20 నుండి 65 సంవత్సరముల మధ్య వయస్సుగల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్లభాషయందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసియుండవలయును. శిక్షణ, వసతి, భోజనములు ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేదీ 15-07-2018. ఈ క్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. మరియు www.Sivananda online.org Website నుండి కూడా పొందవచ్చును. e-mail : yvfa @ dlshq.org.

**Address :**
**The Registrar**
**The Yoga Vedanta Forest Academy**
**Sivanandanagar - 249192**
**Tehri Garhwal District**
**(Uttarakhand)**

ఇట్లు
స్వామి యోగవేదాంతానంద
రిజిస్ట్రార్ - యోగ
వేదాంత ఫారెస్టు
అకాడమీ

అసూయగల హృదయం అశాంతికి నిలయం

వార్తా భారతి

# "పూర్ణిమ" సత్సంగ్

**స్వామి శివానంద లైబ్రరి, కాచిగూడ, హైదరాబాద్**

'పూర్ణిమ సత్సంగ్' అయిదవ సమావేశము, 29 మే 2018న సా॥ 4-00 గంటలకు, శ్రీ ఆర్.వి.జి. కృష్ణమూర్తి గారి అధ్యక్షతన జరిగినది. స్వామి శ్రీ శివానంద ఆశ్రమప్రార్థనతో మొదలైన సత్సంగంలో ఆచార్య రమేష్, యోగ గురూజీ, తమ శిష్య బృందంతో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. దానివలన పాల్గొన్న అందరిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది.

శ్రీ పేరవవి సుధాకర శర్మగారు ముఖ్య అతిథిగా విచ్చేసి 'షడ్దర్శనములు-అద్వైతము' అనే అంశంపై ఎంతో స్ఫూర్తిదాయకంగా ప్రసంగించాడు.

క్లుప్తంగా ప్రసంగ విశేషాలు : భారతీయ సనాతన ధర్మానికి ఉన్న ప్రాముఖత్యను అందరూ గుర్తించాలని, దీనికి కుల, మత, వర్గ భేదాలు లేవని, ఆచరించిన వారందరిని సన్మార్గంలో నడిపిస్తుందని శ్రీ శర్మగారు అన్నారు. మూలాధారమైన వేదాల సారాన్ని పరోక్షంగా ఉపనిషత్తుల ద్వారా గ్రహించగలమని వారు అన్నారు. అదియే వేదాంతమన్నారు.

భారతీయ తత్త్వ సిద్ధాంతాలను షడ్దర్శనాల ద్వారా ఋషిపుంగవులు మనకి అందజేశారని, శ్రీ గౌతమ మహర్షి న్యాయదర్శనాన్ని, శ్రీ కణాద మహర్షి వైశేషిక దర్శనాన్ని, బ్రహ్మకుమారుడైన శ్రీ కపిలముని సాంఖ్య దర్శనాన్ని, 'యోగ సూత్రాల' గ్రంథకర్త శ్రీ పతంజలి మహర్షి యోగ దర్శనాన్ని, ఆవిష్కరించారని, శ్రీ జైమినీ మహర్షి ద్వారా 'పూర్వమీమాంస' వెలువడిందని, శ్రీ మహావిష్ణువు అవతారమైన శ్రీ వ్యాసమహర్షి 'ఉత్తర మీమాంస' ను అందజేశారని శ్రీ శర్మగారు చెప్పారు.

వైశేషిక దర్శనం న్యాదర్శనానికి అనుబంధమని, శ్రీ పతంజలి మహర్షి చెప్పిన అష్టాంగ యోగం ద్వారా మనో నియంత్రణ చేసుకోవచ్చని, ఇది సాంఖ్యయోగానికి అనుబంధమని, 'పూర్వమీమాంస' కర్మకాండకి ప్రాధాన్యమివ్వగ, ఉపనిషత్తులలో చెప్పబడ్డ సిద్ధాంతాలకు అత్యంత సమీపంగ అనుగుణంగా ఉండేది 'ఉత్తర మీమాంస' యని శ్రీ శర్మగారు వివరించారు.

**కల్లాకపటం లేని నవ్వే ఉత్తమ ఔషధం**

హిందూ ధర్మానికి ప్రామాణికంగా చెప్పుకోబడ్డవి మూడు గ్రంథాలు. బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, భగవద్గీత. వీటిని ప్రాస్థానత్రయంగ శ్రీ ఆదిశంకరాచార్యుల వారు పేర్కొన్నారని, వీనిలోని పరస్పర వైరుధ్యాలను బ్రహ్మసూత్రాల ద్వారా శ్రీ వ్యాసమహర్షి తొలగించారని శ్రీ శర్మగారు అన్నారు.

వేదాంత దర్శనానికి భాష్యంవ్రాసిన వారిలో ఆద్యులు శ్రీ ఆదిశంకరాచార్యులని, వారి అద్వైత సిద్ధాంతం సంపూర్ణమైనదని ఉన్నత్తమైనదనీ, ఉదాత్తమైనదని మరియు అద్వితీయమని శ్రీ శర్మగారు కొనియాడారు.

## మానవ జన్మ యొక్క ఆత్యంతిక ప్రయోజనం అద్వైత సిద్ధియని వక్కాణించారు

శ్రీ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు మొ॥ భాష్యకారులు వేదాంత తత్త్వాన్ని, తమ సిద్ధాంతాలను వారి వారి అనుయాయుల ద్వారా ప్రచారంకావించారని శ్రీ శర్మగారు తెల్పారు.

ప్రముఖ యోగ గురువు, శ్రీ శ్రీనివాసాచార్యగారు సత్సంగ్ విచ్చేసి అందరికి తమ అభినందనలను అందించారు. స్వామి శివానంద లైబ్రరి కార్యనిర్వాహక అధ్యక్షులు, శ్రీ చెరుకూరి సిద్ధయ్యగారు, శ్రీ సుధాకర్ శర్మగారి ఉపన్యాసాన్ని సమీక్షించి, వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. జూలై 27న జరిగే 'గురుపూర్ణిమ' మహోత్సవానికి భక్తులందరూ విచ్చేయాలని వారు విన్నవించారు.

- యమ్. అర్వింద్ కుమార్

**మానవుడు ఫలాన్ని ఆశించక "మంచి పనులు చేయాలి" దీనినే నిష్కామకర్మలు అంటారు. ఈ ఫలాలను భగవంతునికి అర్పించాలి దీనినే కర్మయోగము అంటారు.**

***

**ప్రతి రాయిలో ఒక శిల్పం దాగి ఉంటుంది. ఉలితో చెక్కినప్పుడే అది బహిర్గతమవుతుంది, స్తుతి దెబ్బలలో కాదు**

**వాడిన మాట, విసిరిన రాయి తిరిగి రావు**

వార్తా భారతి

## శ్రీ శివానంద ఆశ్రమ వార్తలు

1) శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని యోగా బాలాజీ మందిరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి కల్యాణం జరుగును.

2) ప్రతి శని, ఆదివారాల్లో సాయంకాలం 6-00 గంటలకు స్వామి తత్త్వవిదానంద గారిచే భగవద్గీతపై ప్రవచనాలు జరిగాయి.

## దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణి

3) జూన్ 19, 2018 నాడు శివానందాశ్రమంలో శ్రీశ్రీశ్రీ బ్రహ్మలీన దేవానంద స్వామి 81వ జయంతిని జరుపుకున్నాం. ఈ సందర్భంగా స్వామి ప్రసన్నానందగారు, బొప్పణ అరుణాదేవిగారు, భేరిసునీతా రాంమోహన్‌రెడ్డి గారు మరియు తిప్పరాజుల కొండల్‌రావుగార్ల ప్రవచనాలు జరుపుకున్నాం.

దివ్యాంగులకు ఆశ్రమము తరపున, శ్రీవత్స నృసింహ పాలపర్తి మోరంపూడి ఫౌండేషన్, సేవాభారతి సంయుక్త సహకారంతో వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణిని జరుపుకున్నాము.

**మంచి ఆలోచనలతో, మంచి మనసుతో,**
**మంచి కార్యక్రమాలలో పాల్గొని,**
**యోగా చేయండి;**
**మంచిగా ఉండండి; మంచిని చేయండి; సేవ**
**చేయండి; స్నేహం చేయండి; ధ్యానం చేయండి;**
**జీవితాని సార్థకం పొందండి.**

పూలలోని సువాసన, మనిషిలోని యోగ్యత దాచితే దాగనివి

విశేష భారతి

# 2018 జూలై నెల విశేషాలు

01-07-2018 నిజజ్యేష్ఠ తదియ
11-07-2018 మాసశివరాత్రి
13-07-2018 నిజజ్యేష్ఠ శుక్ల పాడ్యమి
14-07-2018 పూరీ రథయాత్ర
23-07-2018 తొలి ఏకాదశి
27-07-2018 గురు పూర్ణిమ (వ్యాస పూజ)
27-07-2018 చంద్రగ్రహణం
27-07-2018 నిజజ్యేష్ఠ పూర్ణిమ
29-07-2018 సికింద్రాబాద్ **"మహంకాళి జాతర"**

## స్వామి శివానంద

కొద్ది చదవాలి; ఎక్కువగా ఆలోచించాలి. కొద్దిగా మాట్లాడాలి; ఎక్కువ వినాలి. ఇదే బుద్ధిమంతుల లక్షణం; బుద్ధిమంతులు నడిచే మార్గం. మీరు భూతకాలంలోని మీ గతానికి ఉత్తరాధికారులని గ్రహించండి

* * *

ఆలోచనలకు స్వేచ్ఛ నివ్వు. అందువల్ల నిన్ను నీవు పక్షపాత పూర్వక దాసత్వానికి బానిసత్వానికి దూరంగా ఉంచగలుగుతావు. అస్వాతంత్ర్యం బుద్ధిని కుంచింపచేస్తుంది. ఆలోచనల వేగాన్ని నిలిపివేస్తుంది

**Printed and Published by G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY, Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters, I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004, Published at A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM 6-1-110, Padmaraonagar,** Secunderabad - 500 025 **Editor Acharya Kasireddy Venkat Reddy.**
Tel : 040-27503274

వ్యవస్థ మారాలంటే, ముందుగా మనం మారాలి